

నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

"దర్శి ప్రాంతంలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలతో కలిసి ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, కుంటలను కాజేసిన వారు ఇప్పుడు కూడా ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో ఉన్న రూ.6కోట్ల విలువైన కుంట భూమిపై కన్నేసిన వారు దాన్ని కొట్టేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కుంట కట్టను ధ్వంసం చేశారు. కొంత భూమిని చదును కూడా చేశారు. రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా పేరు నమోదు చేయించుకొని మొత్తం స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారు. వారికి రెవెన్యూ అధికారులు సంపూర్ణంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి."

# కుంట భూమిపై కన్ను



ఆక్రమించి చదును చేసిన కుంట భూమి

- కట్టను సైతం ధ్వంసం చేసిన అక్రమార్కులు
- రికార్డుల్లో కుంట స్థానంలో ఒక వ్యక్తిపేరు నమోదు
- దాని విలువ రూ.6కోట్లపైనే!
- రెవెన్యూ అధికారుల సంపూర్ణ సహకారం

దర్శి, జూలై 21 : దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో దర్శి-పొదిలి ప్రధాన రహదారిని ఆనుకొని 6.5 ఎకరాల కుంట భూమి ఉంది. రికార్డుల్లో తక్కెట కుంట అని స్పష్టంగా నమోదైంది. గతంలో ఆప్రాంత రైతులు అరకలు దున్నిన తర్వాత మధ్యాహ్నం ఎడ్లతో పాటు అక్కడ సేదదీరేవారు. ఆవిధంగా ఆ కుంట రైతుల అవసరాలకు ఎంతోకాలంగా ఉపయోగపడింది. సాగర్ కాలువ వచ్చిన తర్వాత ఆ భూములన్నీ మాగాణిగా మారిపోయాయి. ఆతర్వాత కుంట నీటితో పనిలేకుండా పోయింది. దీంతో కొంతమంది రైతులు కుంటలో కొంత భాగాన్ని కలుపుకొని సాగు చేసుకుంటున్నారు.

మరికొంతమంది చదును చేసుకొని ఇటుక వ్యాపారం చేసుకుంటున్నారు. ఇంకా ఎకరానికి పైగా కుంట భూమి ఖాళీగా ఉంది. దానిపై కన్నేసిన వైసీపీ నేత ఒకరు ఆక్రమించేందుకు కొద్దినెలల క్రితం ప్రయత్నించాడు. కుంట కట్టను కొంత మేర తొలగించాడు. దీంతో ఇప్పటికే అక్కడ భూములను అనుభవిస్తున్న వారికి, ఆయనకు మధ్య వివాదం నెలకొంది. వైసీపీ నాయకుడు ఒకవర్గం వారిపై దాడి చేసి గాయపర్చాడు.

### పక్కా ప్రణాళిక

దర్శి-పొదిలి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న తక్కెటకుంట భూమి విలువ ప్రస్తుతం రూ.6 కోట్లకు పైగా ఉంది. పక్కన ఉన్న పొలాలను వ్యాపారులు ఎకరం కోటి రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అక్కడ లేఅవుట్లు కూడా వేశారు. దీంతో 6.5 ఎకరాల కుంట భూమి విలువ విపరీతంగా పెరగటంతో మొత్తం భూమి కొట్టేసేందుకు కొందరు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. అధికారులను లోబర్చుకొని రికార్డుల్లో బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పేరు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా.. కుంట భూమి రికార్డుల తారుమారు విషయం తమ దృష్టికి రాలేదన్నారు. తాను ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చానన్నారు. అంతకుముందు ఎప్పుడు జరిగిందో తనకు తెలియదని చెప్పారు. రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కుంటకట్టను తెగ్గొట్టిన అక్రమార్కులు

### తెరపైకి కొత్తవ్యక్తులు

ఇప్పటికే వైసీపీ నేతకు, భూములు అనుభవిస్తున్న ఎస్టీలకు మధ్య వివాదం కొనసాగుతుండగా ప్రస్తుతం కొత్త వ్యక్తులు తెరపైకి వచ్చారు. రికార్డుల్లో పూర్వీకుల పేరు ఉందని, మొత్తం కుంటభూమిపై తమకే హక్కు ఉందని కొద్దిరోజులుగా హల్‌చల్ చేస్తున్నారు. దీంతో వారు ఏ ధైర్యంతో ఇక్కడకు వచ్చారన్న విషయంపై ఆరా తీయగా రెవెన్యూ రికార్డుల్లో కొత్త పేర్లు నమోదైన విషయం వెల్లడైంది. ఎఫ్ఎల్ఆర్ రికార్డుల్లో తక్కెటకుంట అనే పేరును రౌండప్ చేసి బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అనే పేరును నమోదు చేశారు. ఎంతోకాలంగా అది కుంటభూమి అని అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ ఇటీవల కాలంలో రికార్డుల్లో ఆపేరు ఎలా చేరిందో అర్థం కావటం లేదు.

## ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు

- ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం
- కాలం చెల్లిన సర్వీసుల స్థానంలో కొత్తవి నడుపుతాం
- మంత్రి డాక్టర్ స్వామి
- ఒంగోలులో ఐదు బస్సులు ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 21 : ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఉద్యోగుల భద్రత, సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆదివారం ఒంగోలు డిపోలో రెండు స్టార్‌లైన్, మూడు సూపర్ లగ్జరీ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, సౌకర్యం దృష్ట్యా కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి తీసుకొస్తున్నామని చెప్పారు. పదిరోజుల్లోనే జిల్లాలో నాలుగు స్టార్‌లైన్, ఐదు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించామన్నారు. విడతల వారీగా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల అమలుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు కోసం విధివిధానాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎం బి.సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఒంగోలు రీజియన్‌కు కాలం చెల్లిన బస్సుల స్థానంలో 67 కొత్తవి వచ్చాయన్నారు. సుమారు 20 నుంచి 25 శాతం కొత్త బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు, టీడీపీ మద్దిపాడు మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబుతోపాటు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సిద్ధం

- నాలుగేళ్ల తర్వాత ఉచితంగా పంపిణీకి ఏర్పాట్లు

ఒంగోలు (విద్య), జూలై 21 : ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సిద్ధమయ్యాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోని గోడౌన్లకు ఆదివారం నాటికి అవి చేరాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేస్తారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా సోమవారం నుంచి వీటిని మండల స్థాయి స్టాకు పాయింట్లకు చేరుస్తారు. ఈనెల 24 నాటికి మండల పాయింట్ నుంచి కళాశాలలకు చేర్చి సంబంధిత ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు పంపిణీ చేస్తారు. నాలుగేళ్ల తర్వాత ఎట్టకేలకు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందుతున్నాయి.

## ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి వేడుకలు జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. వేకువజామునుంచే భక్తులు ఆలయాలకు పెద్దఎత్తున తరలివచ్చారు. అన్ని ప్రాంతాల్లోని సాయిబాబా మందిరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా దేవాలయాలను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. షిరిడీనాథునికి ప్రత్యేక పూజలు, విశేష హారతి కార్యక్రమాలను నిర్వహించారు. పలుచోట్ల అన్నసంతర్పణ చేశారు.

- ఒంగోలు కల్చరల్







భక్తులతో కిటకిలాడుతున్న ఒంగోలు లాయర్‌పేటలోని సాయిబాబా మందిరం (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న సాయినాథుడు





విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐలు జగదీష్, అల్లీ సాహెబ్, ఖాజావలి

## మహిళలతో మసాజ్

### స్పా సెంటర్‌లలో నిర్వాకం

- ఒంగోలులో పోలీసుల దాడులతో వెలుగులోకి..
- నాలుగు కేసుల నమోదు
- తొమ్మిది మంది అరెస్టు
- ఏడుగురు యువతులు హోంకు తరలింపు
- పరారీలో వైసీపీ యువనేత అనుచరుడు

ఒంగోలు (క్రైం), జూలై 21 : నగరంలోని కొన్ని స్పా సెంటర్‌లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. వాటిలో మహిళలతో పురుషులకు మసాజ్‌లు చేయిస్తున్నారు. ఈ విషయం పోలీసుల దాడుల్లో వెలుగులోకి వచ్చింది. మూడు స్పా సెంటర్‌ల నిర్వాహకులతోపాటు ఒక రిసెప్షనిస్టు, వాటిలో మసాజ్ చేయించుకుంటున్న ఐదుగురు పురుషులు కలిపి మొత్తం తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు కేసులు నమోదు చేశారు. ఒకరు పోలీసులకు పట్టుబడిన కొద్దిసేపటికే తప్పించుకొని పరారయ్యాడు. ఆయా సెంటర్‌లలో అదుపులోకి తీసుకున్న ఏడుగురు యువతులను హోంకు తరలించారు. వివరాలను ఆదివారం ఒంగోలు ఒన్‌టౌన్‌లో సీఐలు జగదీష్, అల్లీసాహెబ్, ఖాజావలి సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వారి కథనం మేరకు.. నగరంలో మొత్తం 16 స్పా సెంటర్లు నడుస్తున్నాయి. అందులో ఆరు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. వాటిలో మూడింటిపై శనివారం రాత్రి దాడులు చేశారు. అక్కడ పురుషులకు మహిళలు మసాజ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఇది చట్టరీత్యా నేరం. గుంటూరు రోడ్డులో సారబ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌లో ఐదుగురు మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారితో అక్కడ మసాజ్ చేయించుకుంటున్న నలుగురు పురుషులతోపాటు, నిర్వాహకుడు కిమిడి పవన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐలు వెల్లడించారు. అక్కడ మసాజ్ చేయించుకుంటూ దొరికిన ఓ యువకుడు తప్పించుకున్నాడు. స్థానిక అంజయ్య రోడ్డులోని ఎస్ఎస్ సెలూన్, స్పా సెంటర్‌లో మసాజ్ చేస్తున్న ఓ మహిళ, మరో యువకుడితోపాటు నిర్వాహకుడు తురిమెళ్ల పోతురాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. బాలాజీరావుపేటలో ఓరేంజ్ సెలూన్, స్పా సెంటర్‌లో ఒక మహిళ, మసాజ్ చేయించుకుంటున్న వ్యక్తితోపాటు నిర్వాహకుడు కొణిజేటి కన్నయ్య రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న మరో మహిళపై కేసు నమోదు చేశామని తెలిపారు. మూడు చోట్లా అదుపులోకి తీసుకున్న ఏడుగురు మహిళలను హోంకు తరలించామన్నారు. మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. పరారైన మాటూరి ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నామని తెలిపారు. కాగా ప్రతాప్‌రెడ్డి వైసీపీ యువనేత అనుచరుడు. ఆయన పట్టుకొన్న కొద్దిసేపటికే తప్పించుకొని వెళ్లాడని పోలీసులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఇద్దరు మృతి
- నలుగురికి స్వల్ప గాయాలు





గేదెలను ఢీకొని బోల్తా పడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

# ఇదే మంచి సమయం!

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు, తక్షణ ప్రజా అవసరాలపై శాసనసభ్యులు తొలి అడుగు వేసే సమయం ఆసన్నమైంది. అందుకు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ సమావేశాలు వేదిక కానున్నాయి. మాట్లాడే అవకాశం వచ్చినా, రాకున్నా అందుబాటులో ఉండే మంత్రులు, అధికారులకు సమస్యలు వివరించే వీలు వారికి లభిస్తుంది. ఆదిశగా ఎమ్మెల్యేలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. అలాగే సమస్యలను సావధానంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రజానీకం కోరుతోంది.

గళం వినిపించాలి.. సమస్యలను వివరించాలి
అందరూ అందుబాటులో ఉండేది ఇప్పుడే
నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
టీడీపీ ఎమ్మెల్యేలపై ప్రజల ఆశలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు: ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు మొత్తం ఒకే సమయంలో అందుబాటులో ఉండేది అసెంబ్లీ సమావేశాల సమయంలోనే. వారంతా సమావేశం జరిగే సమయంలో అసెంబ్లీలో, ఆతర్వాత సచివాలయంలోని తమ కార్యాలయాల్లో ఉంటారు. ఎలాగూ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలి కాబట్టి వారందరినీ కలిసేందుకు వీలవుతుంది. ఎన్నికల్లో గెలుపొందిన ప్రస్తుత ఎమ్మెల్యేలు బాధ్యతలు చేపట్టడం, అభినందనలు అందుకోవడమే ఇప్పటి వరకూ సాగింది. స్థానికంగా అధికారుల బదిలీలపై దృష్టి సారించారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కొన్ని సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని నియోజకవర్గాలలో కొన్నింటి పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల అసలు పయనం ఇంకా ప్రారంభం కాలేదని చెప్పుకోవాలి. ప్రస్తుత అసెంబ్లీలో టీడీపీ కూటమికి 184 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నందున అందరికీ మాట్లాడే అవకాశం రాకపోవచ్చు. కాదూకూడదని ముందస్తు జాగ్రత్తలు తీసుకొంటే ఏదో ఒక సందర్భంలో మాట్లాడే అవకాశం రావచ్చు. సమావేశాలకు ముందుగానే సమస్యలపై ప్రశ్నలు పంపవచ్చు. ఆయా అంశాలపై చర్చ జరిగేటప్పుడు జోక్యం చేసుకుని మాట్లాడవచ్చు. క్వశ్చన్ అవర్, జీరో అవర్‌లను కూడా అందిపుచ్చునే అవకాశాలు వస్తాయి. తద్వారా అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి జిల్లా, నియోజకవర్గ సమస్యలు తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది.

### అందరూ అందుబాటులో ఉంటారు

అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాకపోయినా ముఖ్యమంత్రి, యావత్ మంత్రివర్గ సభ్యులు సీఎం పేషీ అధికారులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు అంతా ఈ సందర్భంగా అందుబాటులో ఉంటారు. వారిని సమావేశాల ప్రారంభానికి ముందు, సమావేశాలు జరిగే సమయంలో అవకాశం చూసుకుని కలవొచ్చు. ఏరోజుకారోజు అసెంబ్లీ ముగిశాక సీఎం, మంత్రులతోపాటు ఉన్నతాధికారులు వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారు. ఆ సమయాన్ని ఎమ్మెల్యేలు సద్వినియోగం చేసుకోవచ్చు. మంత్రి దృష్టికి ఒక సమస్య తీసుకెళ్తే అత్యవసరం అయితే అప్పటికప్పుడు సంబంధిత శాఖ ఉన్నతాధికారితో మాట్లాడే అవకాశం లభిస్తుంది. జిల్లాలో గెలుపొందిన ఎమ్మెల్యేలలో ఇద్దరు మంత్రులయ్యారు. మిగిలిన 8 మంది అధికార పార్టీ శాసనసభ్యుల్లో కందుకూరు, చీరాల ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీకి వెళుతున్నారు. మిగిలిన వారంతా గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన అనుభవం ఉన్నవారే. వైసీపీ నుంచి దర్శి ఎమ్మెల్యే రెండోసారి, వైపాలెం ఎమ్మెల్యే తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ప్రభుత్వం వారి విన్నపాలకు ప్రాధాన్యం ఇచ్చినా ఇవ్వకపోయినా తమ వంతుగా ప్రజా సమస్యలను అసెంబ్లీ లోపల బయటా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత శాసనసభ్యులపై ఉంది.





### ప్రధాన హామీలపై ముందు దృష్టి పెట్టాలి

జిల్లా అభివృద్ధికి సంబంధించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వెలిగొండ, గుండ్లకమ్మ, రామతీర్థం లాంటి తాగు, సాగునీటి ప్రాజెక్టులపై వారు హామీల వర్షం కురిపించారు. జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని లోకేష్ పదేపదే ప్రకటించారు. మరోవైపు మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ఒంగోలు జిల్లాలో కలుపుతామన్న హామీని తండ్రీకొడుకులు జిల్లాకు వచ్చినపుడల్లా ఇచ్చారు. వాటన్నింటినీ వారికి గుర్తుచేయాల్సిన బాధ్యత జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలపై ఉంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకోవడం.. ఆ తరువాత ఇటు చంద్రబాబు, ఇటు లోకేష్‌తో భేటీ అయి వారిచ్చిన హామీల అమలును గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. వీటికి తోడు నియోజకవర్గాలలో వారిచ్చిన హామీలు, తక్షణ ప్రజావసరాలపై అసెంబ్లీ లోపలా, బయటా వాణి వినిపించాలని ప్రజలు కోరుతున్నారు.


అచలానంద ఆశ్రమంలో విశేష అలంకరణ


మైనంపాడులో జరిగిన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్


సింగరాయకొండలో సంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలతో కళకళ ● పలు చోట్ల అన్నదానాలు**


సంతపేట సాయిబాబు మందిరంలో మహిళల ప్రత్యేక పూజలు


లాయర్‌పేటలో బాబా దర్శనం కోసం భక్తుల బారులు


లాయర్‌పేటలో భక్తుల కోసం అన్నదానం

ఒంగోలు(కల్చరల్), జూలై 21: గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. ఒంగోలు నగరంలోని ఆయా ప్రాంతాలలో ఉన్న షిర్డి సాయిబాబా దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా దేవాలయాలను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి, సాయిబాబాకు ప్రత్యేక పూజలు, విశేష హారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఇక నగరంలోని లాయర్‌పేట, సంతపేట, కర్నూల్‌రోడ్డులోని సాయిబాబా దేవస్థానాలు, సంతపేట శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానం, మంగమూరురోడ్డులోని శ్రీఅచలానందస్వామి ఆశ్రమం, శ్రీసత్యసాయిబాబా మందిరం మొదలైన పలు ఆలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. లాయర్‌పేట సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో సుమారు 10 వేల మందికి, శ్రీఅచలానంద స్వామి ఆశ్రమం వద్ద 4 వేల మందికి అన్నదానం చేశారు. అదేవిధంగా పలు చోట్ల గురుపూజోత్సవం సైతం జరిగింది.

**ఎమ్మెల్యే బీఎన్ ప్రత్యేక పూజలు :** గురుపౌర్ణమి సందర్భంగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మైనంపాడులోని శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మందిర నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం హోమంలో హోమద్రవ్యాలను సమర్పించారు. మందిర అర్చకులు ఎమ్మెల్యేను స్వామివారి శేషవస్త్రాన్ని బహూకరించి వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, యడ్లపల్లి రాంబ్రహ్మం, ఎస్సీసెల్ అధ్యక్షులు కంకణాల గోపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మద్దిపాడు మండలంలో..**

మద్దిపాడు: మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మద్దిపాడులోని హనుమాన్ కాంప్లెక్స్‌లో బాపట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో బాపట్ల పవన్‌కుమార్ దంపతులు భజన కార్యక్రమాలు నిర్వహించి అన్నసంతర్పణ చేశారు. అదేవిధంగా స్థానిక సాయిబాబా ఆలయంలో నవులూరి హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండవ ఆంజనేయులు సాయిబాబా వేషధారణ భక్తులను అలరించింది. పి.హనుమంతరావు భక్తబృందం భజన కార్యక్రమం నిర్వహించారు. ఇక దొడ్డవరప్పాడు సాయిబాబా దేవాలయంలో షిరిడి సాయి పారాయణ చేయగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

**చిర్రికూరపాడులో మంత్రి స్వామి, సత్య ప్రత్యేక పూజలు**

జరుగుమల్లి (కొండపి): గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చిర్రికూరపాడులోని మందిరాల్లో సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.


చిర్రికూరపాడులో సాయిబాబా ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న మంత్రి స్వామి, సత్య

**కొండపిలో...**

మండలంలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు ఆదివారం జరిగాయి. మండల కేంద్రమైన కొండపి, వెన్నూరు, ఇలవర గ్రామాల్లోని బాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొండపిలోని బాబా మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బాబా నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**టంగుటూరులో..**

టంగుటూరు : మండలంలోని కాకుటూరివారి పాలెం, జమ్ముల పాలెం, ఆలకూరపాడు, టంగుటూరులో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కాకుటూరివారి పాలెంలో జరిగిన వేడుకల్లో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, టంగుటూరు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు. కాకుటూరివారి పాలెం శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మంత్రి డాక్టర్ స్వామి, సత్య పాల్గొన్నారు. జమ్ములపాలెం, ఆలకూరపాడు, టంగుటూరులలోని సాయిబాబ మందిరాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి గ్రామోత్సవం జరిపారు.

**సింగరాయకొండలో..**

సింగరాయకొండ: గురుపూర్ణిమ వేడుకలను సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సాయిబాబా మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సాయినాథుడికి కాగడ హారతి, క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీషిరిడి సాయి భక్తబృందం వారు సాయిమందిరంలో భగవన్నామ సంకీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రాత్రికి సాయినాథుడికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిమందిర్ ట్రస్ట్ చైర్మన్ కొల్లూరి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.


మద్దిపాడులో భక్తుల పూజలు


టంగుటూరులో జరిగిన పూజల్లో పాల్గొన్న మంత్రి స్వామి, సత్య


కొండపిలో అన్నదానం

## ఉప్పుగుండూరు పంచాయతీ నిధుల స్వాహాలో ఇరువురు సిబ్బంది సహకారం

**● నోటీసులు జారీ చేసిన డీపీవో**

నాగులుప్పలపాడు, జూలై 21: మేజర్ గ్రామ పంచాయతీ ఉప్పుగుండూరులో చోటు చేసుకున్న నిధుల స్వాహా వ్యవహారంలో అవినీతికి పాల్పడిన అధికారికి సహకరించిన మరికొందరు అవినీతి అధికారుల పాత్ర వెలుగులోకి వచ్చింది. పంచాయతీలో నిధులు స్వాహా జరిగినట్లు సర్పంచ్ దేవరకొండ జయమ్మ అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో పద్మావతిని విచారణాధికారిగా నియమించారు. ఆమె పంచాయతీ రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టారు. 2021 ఏప్రిల్ నుంచి 2023 జూన్ మధ్యకాలంలో పంచాయతీ నిధులను అప్పటి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన శ్రీరామ్మూర్తి ప్రజాధనాన్ని రూ.42 లక్షలు పలు మార్లు స్వాహా చేసినట్లుగా గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న హరిబాబు, జూనియర్ సహాయకుడు పోతురాజు ఆ అవినీతి తతంగానికి తమ వంతు సహకారం అందించారని సమచారం. అవినీతికి పాల్పడిన శ్రీరామ్మూర్తితో కలిసి విచారణ సమయంలో రికార్డుల్లో నగదు వ్యత్యాసాన్ని సృష్టించడం పట్ల అవినీతి బాగోతంలో ఎవరి వాటా ఎంతోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఉప్పుగుండూరు పంచాయతీలో జరిగిన అవినీతిపై ఇచ్చిన ఫిర్యాదును వెనకకు తీసుకోవడంతో మరోసారి విచారణకు వచ్చిన డీఎల్‌పీవో పద్మావతి పంచాయతీ రికార్డులలో నగదు వ్యత్యాసాన్ని గుర్తించారు. దానిపై ఆమె నివేదిక సమర్పిస్తూ నిధుల స్వాహాకు పాల్పడిన శ్రీరామ్మూర్తికి ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి హరిబాబు, జూనియర్ అసిస్టెంట్ పోతురాజు సహకరించారని గుర్తించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించారు. ఆ నివేదిక ఆధారంగా డీపీవో ఉషారాణి వారిద్దరికి షోకాజు నోటీసులు ఇప్పటికే జారీ చేశారు. ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ నిధులు స్వాహాలో ప్రమేయమున్న వారిపై తగిన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ కొలుపులు


ఎద్దుల బండి పై ఏర్పాటు చేసిన ఆలయ నమూనా, నడిపిస్తున్న సత్య

టంగుటూరు, జూలై 21 : మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో పోలేరమ్మ కొలుపులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చివరి ఘట్టంగా బండ్లు కట్టి ఊరేగించారు. ముందుగా పోలేరమ్మ గుడిలో జరిగిన పూజల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ ఊరేగింపులో సత్యా కట్టి నడిపిస్తున్న బండి ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై ఈ వేడుకను తిలకించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రైతు బజార్లలో రాయితీపై నిత్యావసర సరుకులు**

**వచ్చేనెల 15 నుంచి అన్నక్యాంటీన్లు**

**మంత్రి డాక్టర్ స్వామి**


మంత్రి స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 21: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. అందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతు బజార్లలో రాయితీపై నిత్యావసర సరుకులను అందిస్తున్నామని తెలిపారు. ఆమేరకు ఆదివారం మంత్రి స్వామి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామన్నారు. ఏ గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల సోనామసూరి బియ్యాన్ని కిలో రూ.48,49 చొప్పున ప్రజలకు ఇస్తున్నామన్నారు. ఒంగోలులో మూడు చోట్ల, జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లోని రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇవి ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి పేదలు ఆర్థాకలితో అలమటించారన్నారు. అడ్డూఅదుపు లేకుండా పెరిగిన ధరలను తగ్గించి ప్రజలకు ఊరట కలిగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చేనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు కూడా ఏర్పాటు చేసి రూ.5కే పేదల ఆకలి తీరుస్తామని మంత్రి స్వామి తెలిపారు.

# రాష్ట్ర హక్కుల కోసం ఎంపీలు పోరాడాలి

**● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 21 : రాష్ట్ర హక్కుల కోసం టీడీపీ పార్లమెంట్ సభ్యులు పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలతో ఉన్నారన్నారు. అరాచక, నిరంకుశ పాలన పోయిందని చెప్పుకుంటున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని భావిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వం చంద్రబాబు, నితీష్‌కుమార్‌లపై ఆధారపడి పాలన సాగిస్తున్నదన్నారు. ఇప్పటికే నితీష్‌కుమార్ బిహార్ కోసం ప్రత్యేక హోదా, నిధులు కోరారన్నారు. ఈ తరుణంలో చంద్రబాబు మౌనంగా ఉండటం తగదన్నారు. మాజీ సీఎం జగన్ రాజీ ధోరణి అవలంబించడం వల్లనే మట్టికరిచిపోయారని గుర్తు చేశారు. దీన్ని గుణపాఠంగా తీసుకొని టీడీపీ మేల్కొంటే మంచిదని సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఎంపీలు పోరాడాలని కోరారు. బీజేపీకి మద్దతిచ్చే వైసీపీ కూడా గట్టిగా ఉండాలన్నారు. రాష్ట్రం కోసం ఢిల్లీలో ధర్నాలు చేయాలని, ఇక్కడ ఏమైనా అల్లర్లు, గొడవలు ఉంటే అసెంబ్లీలో చర్చించాలని జగన్‌కు సూచించారు. నాలుగేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు వైసీపీ ప్రభుత్వం రూ.61,500 కోట్లు కేటాయించి కేవలం రూ.32వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని శ్రీనివాసరావు తెలిపారు. అందువల్ల ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావసం కల్పించకుండానే గత అక్టోబర్‌లో జగన్ ప్రారంభించారన్నారు. కాలువలు కూడా పూర్తి చేయలేదని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో బాగా వెనుకబడిన ప్రకాశం జిల్లాకు రూ.10వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హనీఫ్, జీవీకొండారెడ్డి, మాబు, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

## ముగిసిన కమ్మ మహాసభలు

ఒంగోలు(కల్చరల్), జూలై 21: హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ కమ్మ మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా 11 తీర్మానాలను ప్రవేశపెట్టినట్లు మహాసభలో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ రచయిత విజయేంద్రప్రసాద్, పలు రాష్ట్రాలకు చెందిన శాసనసభ, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా కమ్మ సమాజ అభివృద్ధికి ఈ మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మహిళా నాయకురాలు రావుల పద్మజ, బొద్దులూరి ఆంజనేయులు, కాట్రగడ్డ రఘు, డాక్టర్ శ్రీమన్నారాయణ, తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

# అవీ..ఇవీ..

## ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరించిన సంఘ నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 21 : ప్రభుత్వం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం కాలేజీల్లో సీట్లు సాధించిన మాదిగ విద్యార్థులకు మాదిగ ఉద్యోగుల సమైఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం ఒంగోలులోని ఎంఈఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కత్తి ఐజక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు బొంతా ఏసుదాసు, ఏకే యూనివర్సిటీ ప్రొఫెసర్ కేవీఎన్.రాజు, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం అభినందనీయమని, కష్టపడి చదవి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో సాల్మన్, ఎంఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి సర్వేపల్లి రవిరాజ్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు లగేజీ బ్యాగ్, సర్టిఫికెట్ ఫైల్, మెమెంటోలను అందజేశారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులతో నిర్వాహకులు

ఒంగోలు(విద్య), జూలై 21: భీమవరంలో ఈనెల 27,28 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఆదివారం క్రీడాకారులకు ఎంపిక చేశారు. జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి షేక్ అబ్దుల్‌నజీర్ స్థానిక సుజాతనగర్‌లోని ఐకాన్ గ్లోబల్ స్కూలులో చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో బత్తిన అభినందన మొదటి స్థానం, సృజన మామిడి రెండో స్థానంలో నిలిచారు. బాలికల సాయిశ్రేష్ఠ మొదటి స్థానం, లాస్యప్రియ ద్వితీయ స్థానం పొందారు. వీరు భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆడిటర్ బి.సుకాంత్, స్కూలు ప్రిన్సిపాల్ కాపా చిరంజీవి అభినందించారు.

## కారు ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు, జూలై 21: కారు ఢీకొని మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద జరిగింది. గుంటూరు వైపు నుంచి తిరుపతి వెళ్తున్న కారు, మరొక కారును అధిగమించబోయి అదుపు తప్పి మోటార్‌సైక్లిస్టును ఢీకొట్టింది. దీంతో వై.రామసుబ్బారెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రుని చికిత్స కోసం గుంటూరు తరలించారు.

## ఉప కార్మిక కమిషనర్‌గా గాయత్రీదేవి


గాయత్రీదేవి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 21: జిల్లా ఉప కార్మిక కమిషనర్‌గా ఎ.గాయత్రీదేవి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌కుమార్ కార్మికశాఖ సంయుక్త కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొంది గుంటూరు జోన్‌కు వెళ్లారు. దీంతో గాయత్రీదేవిని ఉప కార్మిక శాఖ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆమె కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

## ఎయిడెడ్ టీచర్లకు జీతాలు చెల్లించాలి

ఒంగోలు(విద్య), జూలై 21: చెరుకూరు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లకు రావాల్సిన ఆరునెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కోమరోలు ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు టీచర్ల ఇంక్రిమెంట్ల సమస్యను పరిష్కరించాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న సంస్కృతం, హిందీ, తెలుగు, పీఈటీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వంలో విలీనమైన 220 మంది టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా బుద్ధుని ధర్మప్రబోధ


కలెక్టరేట్ ఎదుట ధర్మ ప్రబోధ నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 21: ఆషాడ గురు పూర్ణిమని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం వద్ద బుద్ధుని ధర్మ ప్రబోద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ బుద్ధుని ధర్మంలో అభూత కల్పనలకు తావులేదన్నారు. ప్రపంచానికి వెలుగు మార్గం చూపిన బుద్ధుని ధర్మం అనుసరణీయమని పేర్కొన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ బుద్ధం శరణం గుచ్ఛామి, ధర్మం శరణం గుచ్ఛామి, సంఘం శరణం గుచ్ఛామి అన త్రికరణాలను అందరి చేత పలికించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, సంఘ నాయకులు సలార్, దాసరి సుందరం, ఎం.జార్జి, బి.సుబ్బారావు, ఉదయకుమార్, కొండపి నాగేశ్వరరావు, ధరణికోట లక్ష్మీనారాయణ, ఆర్థా లక్ష్మీప్రసాద్, పిన్నిక శ్రీనివాసరావు, జూలాది మోహన్, శివరావు, జె.సుబ్బారావు, నరసింహారావు, కొమ్ము రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా కళ్లద్దాల పంపిణీ


కంటి అద్దాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఒంగోలు (కల్చరల్), జూలై 21: ప్రముఖ పారిశ్రామిక వేత్త, సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా ఈ నెల 16వ తేదీన తెనాలి నేత్రాలయ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నవారికి ఆదివారం కంటి అద్దాలను అందజేశారు. స్థానిక కర్నూల్ రోడ్‌లోని ట్రస్ట్ కార్యాలయం వద్ద సెక్రటరీ షేక్ సర్దార్ బాషా, నగర అభివృద్ధి సమితి అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావులు పలువురికి అద్దాలను అందించారు. అదేవిధంగా కంటి శుక్లాలు ఏర్పడిన వారికి నేత్రాలయ ఐ కేర్ ద్వారా ఉచిత ఆపరేషన్ చేయించనున్నట్లు వారు పేర్కొన్నారు.

## వేద పాఠశాలకు నిత్యావసర సరుకుల వితరణ


సరుకులను అందిస్తున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), జూలై 21: శ్రీఅభయకళా సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావు ఆదివారం స్థానిక ఆలూరు సీతారావమ్మ రామకోటేశ్వరరావు వేద పాఠశాలకు బియ్యం, నూనె తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వేద పాఠశాల నిర్వాహకులు వత్సం నాగేశ్వర శాస్త్రి శ్రీభరద్వాజ మాట్లాడుతూ మహర్షి వేద విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదపాఠశాలలో పలువురు చిన్నారులు నిత్యం వేద అధ్యయనం చేస్తున్నారని, వారి కోసం నిత్యావసర వస్తువులను అందజేయటం అభినందనీయమని చెప్పారు. మద్దాలి మాధవరావు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో వేదవిద్య ఎంతో ముఖ్యమైనదని, అటువంటి వేదవిద్యను చిన్నారులకు అందిస్తున్న నిర్వాహకుల కృషి హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నేలబొట్ల సదాశివశాస్త్రి తదితరులు పాల్గొనగా మాధవరావును ఘనంగా సత్కరించారు.

## త్వరలో సాగర్ కాలువలకు మరమ్మతులు

**● ఎన్ఎస్‌పీ ఈఈ పూర్ణచంద్**

దర్శి, జూలై 21: సాగర్ కాలువలకు మరమ్మతులు త్వరలో చేపడతామని ఎన్ఎస్‌పీ ఈఈ పూర్ణచంద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్వానంగా సాగర్ కాలువలు శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో నిధుల కొరతతో మరమ్మతుల్లో జాప్యం జరిగిందన్నారు. లష్కర్ల కొరత తీవ్రంగా ఉన్నందున చిల్లచెట్లు తొలగించలేక పోయామని ఆయన పేర్కొన్నారు. రైతులు, సిబ్బంది సహకారంతో చిల్లచెట్లు తొలగించి మేజర్ల గండ్లు పూడుస్తామని ఆయన వివరించారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా.. ఇద్దరు మృతి

● నలుగురికి స్వల్ప గాయాలు




మృతి చెందిన శివయ్య, విజయలక్ష్మి

మార్కాపురం రూరల్, జూన్ 21 : గేదెలను ఢీకొని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడటంతో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెం వద్ద అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం వేకువ జామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నుంచి అనంతపురానికి ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి బయల్దేరింది. అందులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు తిప్పాయపాలెం వద్దకు రాగానే గేదెలు అడ్డుగా వచ్చాయి. దీంతో వాటిని ఢీకొట్టిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గజ్జల శివయ్య(42) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కొర్ర విజయలక్ష్మి (52)ని చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతుల్లో ఒకరైన విజయలక్ష్మి తన భర్త నాయక్‌తో కలిసి విజయవాడ నుంచి కర్నూలుకు వెళ్తోంది. గజ్జల శివయ్య చిలకలూరిపేటలో బస్సు ఎక్కినట్లు ప్రయాణికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు.

## మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ

10మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్

ఒంగోలు(క్రైం), జూలై 21: సంతనూతలపాడులో శనివారం రాత్రి మద్యం మత్తులో పలువురు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకి వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావును మద్యం మత్తులో ఉన్న శీలం మహేశ్వరరెడ్డి అడ్డుకుని విధులకు ఆటకం కలిగించాడు. దీంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ గొడవలో సంతనూతలపాడులో హోటల్ యజమాని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అతను తనపై దాడి చేసిన వారిపై కక్ష తీర్చుకునేందుకు ఆదివారం తన స్నేహితులను పిలిపించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై దేవకుమార్ సకాలంలో స్పందించి గ్రామంలోకి వచ్చిన పదిమందిని అదుపులోకి తీసుకుని అనంతరం వాహనాలను స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులను పిలిపించి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చి వారిని పంపించి వేశారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్




మాట్లాడుతున్న వినోద్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 21 : ఈనెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యారంగ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం చర్చించి పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ డిమాండ్ చేశారు. అందుకోసం శాసనసభ్యులకు వినతిపత్రాలు, లేఖలు రాయడం జరిగిందన్నారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న హాస్టళ్ల మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, జీవోనెంబరు 77ను రద్దు చేసి ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ అందించడంతో పాటు పాత బకాయిలను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూలుప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని, డిగ్రీ విద్యలో ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలని కోరారు. పాఠశాల విద్యలో గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోను రద్దు చేయాలని, పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు సమాంతర మీడియంలలో బోధన అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీఎంఈ, ఈసీఈ కోర్సులు ప్రారంభించాలని, కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించి విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.విజయ్, విజయకుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థికి ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, జూలై 21: ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మేకల మగ్గారావు కుమారుడు పవన్‌కుమార్ ఇంటర్మీయట్ చదువుకోసం గ్రామానికి చెందిన వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబుకు ఆదివారం ఆర్థికసాయం చేశారు. రూ.10వేలను విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో అమరా వేణు, కొంజేటి జలంధర్, నాగవరప్రసాద్, తెలగతోటి శామ్యుల్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా నల్లబజారుకు రేషన్ బియ్యం!

దాడులు చేస్తున్నా.. వెనుకాడని మాఫియా ● అధికారుల పాత్రపైనా సందేహాలు



చీర్వానుప్పలపాడులో రేషన్ బియ్యం లారీని పట్టుకున్న అధికారులు (ఫైల్)

నాగులుప్పలపాడు, జూలై 21: నాగులుప్పలపాడు మండలంలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. రేషన్‌బియ్యం అక్రమ మార్గాలలో తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అయితే అధికారులు పలు సందర్భాల్లో దాడులు చేసి పట్టుకున్నా.. రేషన్ మాఫియా మాత్రం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. మండలంలో రేషన్ బియ్యం వ్యాపారులతో పలువురు డీలర్లు, రేషన్ బియ్యం పంపిణీ వాహనం ఆపరేటర్లు కుమ్మక్కైనట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. కార్డుదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయకుండా నల్లబజారుకు తరలించి వాటాలు పంచుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పౌరసరఫరాల, విజిలెన్స్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను దాడులు చేసి పట్టుకుంటున్నా ఏమాత్రం భయపడకుండా తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దాంతో అధికారుల పాత్రపైన ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

**గడిచిన రెండు వారాల్లో..**

మండలంలో 53 రేషన్ దుకాణాలున్నాయి. ప్రతి నెలా కార్డుదారులకు రేషన్ సరుకులు అందించేందుకు 12 రేషన్ పంపిణీ వాహనాలు పనిచేస్తున్నాయి. రేషన్ బియ్యం ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు ఇంటింటికి వెళ్లి అందించాల్సి ఉంది. కానీ అరకొర రేషన్ బియ్యం అందించి రేషన్ మాఫియాతో కుమ్మకై బియ్యం అమ్ముకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవలకాలంలో ఒంగోలు, పమిడిపాడుకు చెందిన పలువురు వ్యక్తులు నాగులుప్పలపాడు మండలంలో తిష్ట వేసి జోరుగా రేషన్ మాఫియాను నిర్వహిస్తున్నారని సమాచారం. ఈక్రమంలోనే మండల పరిధిలో పలు మార్లు ఆయా వ్యక్తుల అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న లారీలను విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గడచిన 15రోజుల్లో మండలంలోని బి.నిడమానూరు, అమ్మనబ్రోలు, చీర్వానుప్పలపాడు, పోతవరం గ్రామాలలో ఒంగోలుకు చెందిన రేషన్ మాఫియా వ్యక్తులు దగ్గరుండి మరీ పేదల బియ్యాన్ని లారీలలో తరలిస్తుండగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకొన్నారు. అయితే నామమాత్రపు కేసులతో సరిపెట్టడంతో రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీర్వానుప్పలపాడులో విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకొన్న లారీలో సుమారు 150 పైగా రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. కానీ దాడులు చేసిన అధికారులు 34 బస్తాలను మాత్రమే స్వాధీనం చేసుకున్నామని చెప్పడం వెనుక అధికారుల పాత్రపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

**కఠిన చర్యలతోనే సత్ఫలితాలు..**

ప్రభుత్వాలు మారుతున్నా రేషన్ మాఫియా కార్యకలాపాలు ఆగడం లేదు. ఈ మాఫియాను అరికట్టే చర్యల్లో కఠిన నిర్ణయాలు తీసుకొనే పరిస్థితి రావాలి. కొంతమంది రైస్ మిల్లుల్లో మళ్లీ పాలిష్ చేసి మంచి బియ్యంతో కలిపి అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటా..

ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ● చీమకుర్తిలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సత్కారం



ఎమ్మెల్యే బీఎస్‌ను సత్కరిస్తున్న శిద్దా సుధీర్‌కుమార్, సంఘ నాయకులు

చీమకుర్తి, జూలై 21 : తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ఆర్యవైశ్య సోదరులకు అన్ని విధాల అండగా నిలుస్తానని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తిలోని వాసవి కళ్యాణమండపంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ఘనసత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి గెలుపులో ఆర్యవైశ్యుల కృషిని కొనియాడారు. చీమకుర్తి పట్టణంలో ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో తన గెలుపుకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న యువపారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విజయ్‌కుమార్‌కు తన ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయ్‌కుమార్‌ని ఆర్యవైశ్యసంఘ నాయకులు, వాసవిమహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శిద్దా పాండురంగారావు, చలువాది బదరీనారాయణ, శిద్దా నాగేశ్వరరావు, శిద్దా సుధాకర్, పల్లపోతు వెంకటేశ్వర్లు, నూనె వెంకట సుబ్రహ్మణ్యం, మద్ది వెంకట్రావు, దుడ్డు రంగనాయకులు, కొణిజేటి సువర్ణ, శరవణ్‌కుమార్, నూకల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, అవిశనేని వెంగన్న, గొట్టిపాటి రాఘవరావు, కందిమళ్ల గంగాధరరావు, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, పూనాటి వెంకట్రావు, సూరంపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర ఆధ్వర్యంలో వైద్యసేవలు అభినందనీయం

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు




మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయడు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 21: కనిగిరి ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం ఉగ్రనరసింహారెడ్డిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, జంషీర్, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతి రెడ్డి(ఎస్‌టీఆర్) తదితరులు పాల్గొన్నారు. మెగా వైద్యశిబిరంలో 700 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 458 మందిక కంటి ఆపరేషన్‌లు చేయించాల్సిందిగా శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు గుర్తించారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని విడతల వారీగా గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# చందవరంలో వారధి నిర్మాణం జరిగేనా..?

రెండున్నర సంవత్సరాల క్రితం కూలిన వంతెన

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం ● రైతుల అవస్థలు



వంతెనపై కర్రలు ఏర్పాటుచేసుకొని రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

దొనకొండ, జూలై 21: మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కెనాల్‌పై నిర్మించిన వంతెన రెండున్నర సంవత్సరాల క్రితం కూలిపోయింది. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన ఈ వంతెన నిర్మాణం గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు చెందిన దాదాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్ కాలువకు అవతలివైపున ఉంది దీంతో రాకపోకల నిమిత్తం అప్పట్లో కెనాల్‌పై వారధి నిర్మించారు. 2022 ఫిబ్రవరిలో ఇది కాలువలోకి కుప్పకూలింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు రాకపోకలు జరుపుకునేందుకు రెండున్నర సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. వంతెన నిర్మాణం గురించి అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా ఇప్పటివరకు పట్టించుకున్న నాథుడే లేడు. ప్రతిరోజు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేకపోతున్నారు. దీంతో కూలిన వంతెనపై నడిచి వెళ్లేందుకు నిచ్చెనలా కర్రలు ఏర్పాటుచేసుకొని ప్రమాదకర పరిస్థితుల్లో అటుఇటు రాకపోకలు జరుపుతున్నారు. ఆ సమయంలో ఒకరిద్దరు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పశుపోషకులు తప్పనిసరై పశువులను మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన గుండా ప్రతిరోజు రాకపోకలు జరుపుకుంటున్నారు. సాగర్ కాలువలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తున్న సమయంలో కూలిన వంతెన పైనుంచి రాకపోకలు జరుపుకునేందుకు కుదరకపోవటంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గేవరకు తప్పనిసరిగా చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లటం తప్పనిసరి. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన సాగర్ కాలువ పై వంతెన నిర్మాణం గురించి వైసీపీ పాలకులు, అధికారులు రెండున్నర సంవత్సరాలుగా పట్టనట్టుగా వ్యవహరించారు. సాగర్ కాలువపై వంతెన నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో, తమ ఇబ్బందులు ఎప్పుడు తొలగుతాయోనని ఈప్రాంత ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వంలో వేగవంతంగా వంతెన నిర్మాణం జరిగితే తమ ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

# 'ఐ లవ్ అద్దంకి' బోర్డుపై అంత నిర్లక్ష్యమా..?

అంద విహీనంగా మారిన వైనం

నిర్వహణలో గత పాలకుల నిర్లక్ష్యం

ఆవేదనలో పట్టణవాసులు




శింగరకొండ సమీపంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ అద్దంకి బోర్డు

అద్దంకి, జూలై 21 : వైసీపీ పాలనలో అన్ని మున్సిపాలిటీలలో ఆర్భాటపు హంగుల కోసం లక్షల రూపాయలు ఖర్చుచేశారు. వాటి నిర్వహణపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగమయ్యాయి. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో శింగరకొండ సమీపంలోని 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద 2022లో సుమారు రూ.5లక్షలతో ఐ లవ్ అద్దంకి బోర్డు ఏర్పాటు చేసి చుట్టూ గ్రీనరీ అభివృద్ధి చేశారు. అదే సమయంలో నామ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వేసే సమయంలో అదే కాంట్రాక్టర్ చేత హైమాస్ లైట్ కూడా ఏర్పాటు చేయించారు. అయితే అటు గ్రీనరీ, హైమాస్ లైటింగ్ నిర్వహణ లేకపోవడం ప్రస్తుతం రంగుల వెలుగులతో ఉండాల్సిన బోర్డు వెలవెలబోతోంది. కనీసం లైటింగ్ నిర్వహణ అయినా ఉంటే పరిసర ప్రాంతాలకు, వాహనచోదకులకు ఉపయోగకరంగా ఉండేది. ఆర్భాటంగా ఏర్పాటు చేసినా కొద్ది నెలలకే నిరుపయోగంగా మారినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

● గాలిపటం ఎగురవేస్తుండగా ఘటన

గిద్దలూరు టౌన్, జూలై 21 : గాలిపటం ఎగురవేస్తుండగా విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనకు గిద్దలూరులో జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం.. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని కొండపేట వడ్డెరకాలనీలో నాగులు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నాగేంద్ర (11) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం గ్రామంలో గాలిపటం ఎగుర వేస్తుండగా గాలిపటం చెట్టులో చిక్కుకొంది. దానిని తీసేందుకు నాగేంద్ర చెట్టుపైకి ఎక్కి తీస్తున్నాడు. ఆ సమయంలో చెట్టులో ఉన్న విద్యుత్ తీగ నాగేంద్రకు తాకింది. దీంతో చెట్టు నుంచి కిందపడ్డాడు. సమీపంలోని వారు గమనించి అక్కడికి వెళ్లేసరికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## కంభంలో చోరీ

కంభం, జూలై 21 : కంభం పట్టణం సంఘంవీధిలో తాళం వేసి ఉన్న గృహంలో దొంగలు పడి బీరువాలో దాచి ఉంచిన 2 తులాల బంగారం, రూ.5వేల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం.. సంఘం వీధిలో నివసిస్తున్న రహంతుల్లా కొబ్బరిబోండాల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి అత్తగారి ఊరికి వెళ్లారు. గమనించిన దొంగలు శనివారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. రెండు బీరువాలను పగులగొట్టి 2 తులాల బంగారం, రూ.5వేల నగదు దోచుకెళ్లినట్లు తెలిసింది. అదేవీధిలోని సతీష్ అనే యువకుడి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

## యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

కంభం(అర్థవీడు), జూలై 21: యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.అనిత తెలిపిన వివరాల మేరకు.. అర్థవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామానికి చెందిన శెట్టి అనిల్‌కుమార్ మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు శారీరకంగా లోబరుచుకున్నాడు. తరువాత పెళ్లి చేసుకోనని చెప్పి వేరే పెళ్లికి సిద్ధమవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్‌కు లేఖ రాసి వారిని ఆశ్రయించింది. విషయం తెలుసుకుని వచ్చిన డివిజన్ ప్రెసిడెంట్ కాటమాల అజిత్‌కుమార్ బాధితురాలి పక్షాన పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పలు సెక్షన్ల కింద అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అజిత్‌కుమార్ మాట్లాడుతూ కేసు తప్పుదోవ పట్టకుండా చట్టబద్ధంగా విచారించాలన్నారు. అనంతరం కంభం ఏఎస్సైకి వినతిపత్రం అందజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిత తెలిపారు.

## వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం, జూలై 21: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని శ్రీక్రోధి నామ సంవత్సర ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పు వైపు మెట్ల నుంచి ప్రదక్షిణ ప్రారంభించారు. మంగళవాయిద్యాల నడుమ ఓం నమః శివాయనామ మంత్రాన్ని జపిస్తూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, భక్తులు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నెమలి కనువిందు..



గ్రామంలో విహరిస్తున్న నెమలి

బేస్తవారపేట, జూలై 21 : బేస్తవారపేట మండలంలోని జగ్గంబోట్ల కృష్ణాపురం గ్రామంలోకి ఆదివారం నెమలి వచ్చింది. ఈ గ్రామం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో గ్రామంలోని ఒక సిమెంట్ రోడ్డుపైకి నెమలి వచ్చి గంటపాటు రోడ్డుపై సంచరించింది. గ్రామంలోని ప్రజలు అక్కడికి చెరుకోని నెమలిని ఆసక్తిగా తిలకించారు. అక్కడే కొద్దిసేపు ఉండి తరువాత అడవిలోకి వెళ్లిపోయింది.

## సాగర్ జలాలతో ఎస్ఎస్ ట్యాంకులు నింపాలి

● సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

త్రిపురాంతకం, జూలై 21: జిల్లా తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలతో ఎస్ఎస్ ట్యాంకులు నింపాలని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. ఆదివారం సాగర్ కాలువపై విశ్వనాథపురం సమీపంలోని 101 మైలు నుంచి దూపాడు వరకు పర్యటించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పంపుసెట్ల పనితీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రామకృష్ణతో మట్లాడారు. ఎక్కడా నీటి చౌర్యం జరుగకుండా, లీకేజీలు జరుగకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దారు రామకృష్ణ శివప్రసాద్, ఆర్ఐ ముకుందహరి, ఎన్నెస్పీ ఏఈఈలు శివన్నారాయణ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి వైద్యం

● వివరాలు చెప్పకపోవడంతో తలలు పట్టుకున్న పోలీసులు


చీరాలటౌన్, జూలై 21 : తీవ్ర రక్త గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలకు వచ్చిన వ్యక్తికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతడు స్పృహలోనే ఉన్నా వివరాలు చెప్పలేక పోతుండడంతో వైద్యులు, అవుట్ పోస్ట్ పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చీరాల ఏరియా వైద్యశాలకు 108లో తలకు వెనుక భాగంలో తీవ్రమైన రక్త గాయాలతో ఉన్న 35 సంవత్సరముల వ్యక్తి వచ్చారు. అతనికి వైద్య సేవలు చేసేందుకు వైద్యులు రాగా నిరాకరించారు. వెంటనే వెళ్లాలని వారిని ఇబ్బందులకు గురి చేశాడు. అయినా బలవంతంగా వైద్యం చేశారు. సమాచారం అందుకున్న అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకునేందుకు ఆరా తీయగా, తన పేరు గోఫర్ అని తన బాబాయి సిద్ధు, మరొకరు కర్రతో దాడిచేశారని, తాను చెరువుల వద్ద కాపలా ఉంటానని చెప్పాడు. మరొకసారి తాడేపల్లి అని, కొట్టి ఇక్కడ హాస్పిటల్‌కు దూరంలో పడేశారని చెప్పాడు. దీంతో ఇతని వివరాలు బంధువులకు తెలిపేందుకు వైద్యులు, పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ బలమైన దెబ్బలు కావడంతో మతిస్థిమితం కోల్పోయి ఉంటాడేమోనని భావిస్తున్నారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, జూన్ 21: మార్కాపురం రైల్వే స్టేషన్ పరిధిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి షేక్ హమీద్(54) మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. మృతుడు పట్టణంలోని 28వ వార్డుకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.







మార్కాపురంలో విశేష అలంకరణలో సాయినాథుడు, హాజరైన భక్తులు, గిద్దలూరులో సాయిబాబాకు హారతిపడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, వై.పాలెంలో బాబాకు పూజలు, శాకాంబరిగా అమ్మవారు

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

## బాబా మందిరాల వద్ద బారులు తీరిన భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలను మార్కాపురంలోని నెహ్రూబజార్‌లోని షిరిడి సాయిబాబా మందిరం జవహర్‌నగర్‌లోని షిరిడిసాయి, సత్యసాయిబాబా మందిరాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి కాగడ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేకపూజలు, సాయిసత్య వ్రతాలు నిర్వహించారు. నెహ్రూబజార్‌లో దాదాపు 25వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జవహర్‌నగర్‌లో ఆర్.రామచంద్రరావు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పేదలకు వివిధ సహాయ కార్యక్రమాలు నిర్వహించారు.

కొమరోలు : మండలంలోని కొమరోలు, రెడ్డిచర్ల, చింతలపల్లి గ్రామాల్లోని శ్రీ సాయిబాబా మందిరాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొమరోలు శ్రీ షిరిడీసాయిబాబా దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శుక్రవారం నుంచి మూడురోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఉదయం బాబాకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఆలయ అధ్యక్షులు సముద్రాల బ్రహ్మయ్య కార్యక్రమాలు పర్యవేక్షించారు. మండలంలోని రెడ్డిచర్ల, చింతలపల్లి సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో, తెలుగువీధి లోని దేవాలయం, మొహిద్దీన్‌పురంలోని సాయిబాబా దేవాలయం, అర్ధవీడులోని మందిరాలలో భక్తులు తరలి వచ్చి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నదానం చేశారు.

గిద్దలూరు : మండలంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. షిర్డిసాయిబాబా మందిరాలకు ఆదివారం తెల్లవారుజామును నుంచే భక్తులు పోటెత్తారు. మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న షిర్డిసాయిబాబా దేవాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్థన్, దేవస్థాన ధర్మకర్త డాక్టర్ జేవీ.నారాయణ తదితరులు బాబాకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. రాచర్ల రోడ్డులోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సామూహిక పూజా కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. వీఆర్ కాలనీలో సైతం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

పెద్ద దోర్నాల : పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మణి స్వామి బాబాను విశేషంగా అలంకరించారు. దోర్నాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీవీఎల్ ప్రసాద్, అన్నా వెంకట ప్రసాద్, పీ రామారావు, రావిక్రింది సుబ్బరత్నం, బొగ్గరపు రమేష్, ఒంటేరు రమణ, ఎం.మల్లికార్జునరావు, పీ.నాగేంద్రబాబు, పీ.సుబ్బారావు, యక్కలి యోగి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : స్థానిక ఎస్సీ కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాకడ హారతి, సాయిబాబా అభిషేకం, గణపతిపూజ, అర్చన, శ్రీవారిపాదపూజ, గోత్ర నామార్చన, విష్ణు సహస్రనామార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నహారతి, అన్నదానం నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామోత్సవం, సంధ్యాహారతి, శేజహారతి, పవళింపుసేవ నిర్వహించారు.

ఎర్రగొండపాలెం : స్థానిక సాయిబాబా ఆలయంలో ఆదివారం భక్తులు గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సాయిబాబాకు ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటలకు సాయివ్రతం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మంగళరహారతి ఇచ్చి మహానైవేద్యం సమర్పించారు.

### శాకాంబరి అలంకారం

గిద్దలూరు : పట్టణంలోని శ్రీపాతాళనాగేశ్వరస్వామి దేవాలయంలో శాకాంబరి ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పార్వతిదేవికి కూరగాయలతో అలంకారం చేశారు. ఈసందర్భంగా సామూహికంగా మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి పుష్పలీల శాకాంబరి పూజ కార్యక్రమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన ఇఒ శ్రీనివాసరావు, మాజీ జడ్పీటిసి పిడతల సరస్వతి, పిడతల ఫౌండేషన్ అధ్యక్షులు పిడతల రమేష్‌రెడ్డి, దేవస్థాన కమిటీ మాజీ ఛైర్మన్ శివపురం ఆంజనేయులు, మహిళ సంఘం ప్రతినిధులతోపాటు ఆలయ పూజారి అనీల్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా భక్తులకు సాయిసేవా సమితి సభ్యులు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలవరకు సాయిబాబా చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు.

పొదిలి : పట్టణంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు సాయిబాబాను దర్శించుకునేందుకు ఉదయం నుండే క్యూ కట్టారు. పట్టణంలో జూనియర్ కళాశాల రోడ్డు, రథం రోడ్డలలోని సాయిబాబు మందిరాలను విద్యుత్ వెలుగుతో అలంకరించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శినం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

బేస్తవారపేట : బేస్తవారపేటలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బేస్తవారపేటలోని శ్రీసాయిబాబా ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అహోషేకాలు, అర్చనలు గిరిస్వామి నిర్వహించారు. సాయంత్రం బేస్తవారపేట పట్టణంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

తర్లుపాడు : తర్లుపాడులోని షిరిడి సాయి మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు అలుగుపల్లి బాలబ్రహ్మం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వివిధ అభిషేకాలు, హారతులు ఇచ్చారు. గురుపౌర్ణమి మహోత్సవం సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి పల్లకిసేవను తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు కోలాటం ప్రదర్శన నిర్వహించారు. స్వామివారికి మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్త మాదల నాగమల్లికార్జున్ ప్రత్యేకఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అవీ..ఇవీ..

### వైభవంగా గిరి ప్రదక్షిణం



గిరి ప్రదక్షిణం చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం, జూలై 21: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని శ్రీక్రోధి నామ సంవత్సర ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకులు విశ్వనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పు వైపు మెట్ల నుండి ప్రదక్షిణం ప్రారంభించారు. మంగళవాయిద్యాల నడుమ ఓం నమః శివాయనామ మంత్రాన్ని జపిస్తూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, భక్తులు ప్రతినిధులు పాల్గొన్నారు.

### ట్యాంకర్‌తో నీటిసరఫరా ప్రారంభం



ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న విఘ్నేష్‌రెడ్డి

పొదిలి, జూలై 21 : పట్టణంలోని ఆరవవార్డు ఎస్టీకాలనీలో నీటిసమస్య ఉందని కాలనీవాసులు స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి మంచి నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేయించారు. ఆదివారం నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆయన తనయుడు విఘ్నేష్‌రెడ్డి చేతులమీదుగా ట్యాంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో, మండలంలో తాగునీటి సమస్య లేకుండా తీర్చాలనే ఆశయంతో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు ప్రణాళిక వేసుకొని ముందుకు వెళదామన్నారు. అనంతరం గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో స్వామివారికి జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, లాయర్ ఎస్ఎం భాష, కాటూరి శ్రీను, యాసిన్, మౌలాలి, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

### కృష్ణాపురంలో నెమలి కనువిందు



రోడ్డుపై సంచరిస్తున్న నెమలి

బేస్తవారపేట, జూలై 21 : బేస్తవారపేట మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలోకి ఆదివారం నెమలి వచ్చింది. ఈ గ్రామం ఆటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో గ్రామంలోని ఒక సిమెంట్ రోడ్డుపైకి నెమలి వచ్చి గంటపాటు రోడ్డుపై సంచరించింది. గ్రామంలోని ప్రజలు అక్కడికి చెరుకొని నెమలిని ఆసక్తిగా తిలకించారు. అక్కడే కొద్దిసేపు ఉండి అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది.

### మూఢ నమ్మకాలను నిరోధానికి జేవీవీ కృషి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 21: ప్రజల్లో మూఢనమ్మకాలు నిరోధించడానికి, పర్యావరణ పరిరక్షణకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జేవీవీ జిల్లా కార్యదర్శి సీహెచ్ జయప్రకాశ్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జేవీవీ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆగస్టు 10న జరగనున్న జనవిజ్ఞాన వేదిక వార్షిక సభలు పురస్కరించుకొని కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు డా.శరత్, నాయకులు వై.రవి, రమణయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రఫి, వెంకట్రావ్ పాల్గొన్నారు.

### పోలేరమ్మకు ఆదివారం జాతర



విశేష అలంకరణలో పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 21: పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి వైభవంగా జాతర నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### సాగర్ జలాలతో ఎస్ఎస్ ట్యాంకులు నింపాలి

● సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

త్రిపురాంతకం, జూలై 21: జిల్లా తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలతో ఎస్ఎస్ ట్యాంకులు నింపాలని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. ఆదివారం సాగర్ కాలువపై విశ్వనాథపురం సమీపంలోని 101 మైలు నుండి దూపాడు వరకు పర్యటించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పంపుసెట్ల పనితీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రామకృష్ణతో మట్లాడారు. ఎక్కడా నీటి చౌర్యం జరుగకుండా, లీకేజీలు జరుగకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దారు రామకృష్ణ శివప్రసాద్, ఆర్ఐ ముకుందహరి, ఎన్నెస్పీ ఏఈఈలు శివన్నారాయణ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## కంభంలో చోరీ



తెరిచి ఉన్న బీరువా

కంభం, జూలై 21 : కంభం పట్టణంలోని సంఘంవీధిలో తాళం వేసి ఉన్న గృహంలో దొంగలు పడి బీరువాలో దాచి ఉంచిన 2 తులాల బంగారం, రూ.5వేల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం, సంఘం వీధిలో నివసిస్తున్న రహంతుల్లా కొబ్బరిబోండాల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి అత్తగారి ఊరికి వెళ్లారు. గమనించిన దొంగలు శనివారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. రెండు బీరువాలను పగులగొట్టి 2 తులాల బంగారం, రూ.5వేల నగదు దోచుకెళ్లినట్లు తెలిసింది. అదేవీధిలోని సతీష్ అనే యువకుడి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కంభం (అర్ధవీడు), జూలై 21 : యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై అర్ధవీడు ఎస్సై ఎం.అనిత వివరాలు వెల్లడించారు. అర్ధవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామానికి చెందిన శెట్టి అనిల్‌కుమార్ మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు శారీరకంగా లోబరుచుకున్నాడు. తరువాత పెళ్లి చేసుకోనని చెప్పి వేరే పెళ్లికి సిద్ధమవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు లేఖ రాసి వారిని ఆశ్రయించింది. విషయం తెలుసుకుని వచ్చిన హ్యూమన్ రైట్స్ జస్టిస్ డివిజన్ ప్రెసిడెంట్ కాటమాల అజిత్ కుమార్ వచ్చి బాధితురాలి పక్షాన పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పలు సెక్షన్ల కింద అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అజిత్‌కుమార్ మాట్లాడుతూ కేసు తప్పుదోవ పట్టకుండా చట్టబద్ధంగా విచారించాలన్నారు. అనంతరం కంభం ఏఎస్పైకి వినతిపత్రం అందచేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.అనిత తెలిపారు.

## వృద్ధుడికి నిత్యావసర సరుకులు

కొమరోలు, జూలై 21: దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వృద్ధునికి నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకులు లోక్కు శరత్‌బాబు తెలిపారు. కొమరోలు పట్టణంలోని కాకర్ల మస్తానయ్య అనే వృద్ధుడు కొన్ని నెలలుగా పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. దీన్ని తెలుసుకొన్న దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు వారి కుటుంబానికి ఒక నెలపాటు అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ నిరుపేదలకు దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ద్వారా పలు కార్యాక్రమాలను దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. కార్యాక్రమంలో లొక్కు సుమన్, సిద్ధయ్య, సునీల్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

## నిరాడంబర శ్రీసాయి పుస్తకావిష్కరణ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 21: పట్టణంలోని దత్తసాయి రామాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఓరుగంటి మల్లిక్ రచించిన నిరాడంబర శ్రీసాయి గ్రంథావిష్కరణ సాయిబాబా భక్తుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో రచయిత, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, కవులు డా.అన్నపురెడ్డి వీరారెడ్డి, డా.కప్పగంతుల మధుసూదన్, తోట శ్రీనివాసరావు, నాగిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి

● గాలిపటం ఎగురవేస్తుండగా ఘటన

గిద్దలూరు టౌన్, జూలై 21 : గాలిపటం ఎగురవేస్తుండగా, పటం చెట్టులో చిక్కుకుంది. దీంతో దీన్ని చెట్టు నుంచి తీసే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తాకడంతో విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల సమాచారం ప్రకారం.. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని కొండపేట వడ్డెర కాలనీలో నాగులు, లక్ష్మీదేవి దంపతులకు నాగేంద్ర (11) కుమారుడు ఉన్నాడు. ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం గ్రామంలో గాలిపటం ఎగుర వేస్తుండగా గాలిపటం చెట్టులో చిక్కుకొంది. దానిని తీసేందుకు నాగేంద్ర చెట్టుపైకి ఎక్కి గాలిపటం తీస్తున్నాడు. ఆ సమయంలో చెట్టులో ఉన్న విద్యుత్ తీగ నాగేంద్రకు తాకింది. దీంతో చెట్టు నుంచి కిందపడ్డాడు. సమీపంలోని వారు గమనించి అక్కడికి వెళ్లేసరికే మృతిచెంది ఉన్నాడు. ఘటన స్థలాన్ని గిద్దలూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## మట్కా నిర్వాహకులపై బైండవర్ కేసులు

గిద్దలూరు టౌన్, జూలై 21 : మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని తహసీల్దార్ వద్ద హాజరుపరచి బైండర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఓ మహిళతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధి

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 21 : రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ఇందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. గిద్దలూరు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరగ్గా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.., ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తూ దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతానన్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో, ప్రజా ప్రతినిధులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సహాయ సహకారాలతో గిదలూరు మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో తాను శాసన సభ్యునిగా ఉన్న కాలంలో ప్రజా అవసరాల దృష్ట్యా అభివృద్ధి చేశానన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కడప లక్ష్మీ, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌రావు, ఎంపీడీవో హైమావతి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదబీమా అందజేత

### జనసేన కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేసిన నాగబాబు



లక్ష్మణమూర్తి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నాగబాబు

గిద్దలూరు టౌన్, జూలై 21 : కంభం మండలంలోని తురిమెళ్లకు చెందిన జనసేన కార్యకర్త లంకా లక్ష్మణమూర్తి ప్రమాదశాత్తు మృతి చెందగా ఆయన కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. ఆదివారం విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు లక్ష్మణమూర్తి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు రియాజ్, జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు ఉన్నారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయిబాబా మాట్లాడుతూ పార్టీకి అండగా ఉన్న కార్యకర్త లకు ప్రమాదం సంభవించిన సమయంలో పార్టీ అండగా నిలిచి వారి కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందిస్తోందన్నారు.

పుల్లలచెరువు : ప్రమాదంలో మృతిచెందిన జనసేన కార్యకర్త కోటారి గాలెయ్య కుటుంబానికి రూ.5 లక్షల విలువైన ప్రమాద బీమా చెక్కును జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు అందజేశారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పుల్లలచెరువు మండలం శతకోడు గ్రామానికి చెందిన కోటారి గాలెయ్య కుటుంబ సభ్యులైన భార్య, కుమారుడికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ జనసేన సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.గౌతంరాజు, జనసేన మండలాధ్యక్షుడు కోటారి అచ్చయ్య జనసేన నాయకులు పాల్గొన్నారు.


## ట్రావెల్స్ బస్సు బోల్తా.. ఇద్దరి మృతి

● నలుగురికి స్వల్ప గాయాలు



శివయ్య మృతదేహం

మార్కాపురం రూరల్, జూన్ 21 : గేదెలను ఢీకొని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడటంతో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని తిప్పాయపాలెం వద్ద అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నుంచి అనంతపురానికి ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి బయల్దేరింది. అందులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు తిప్పాయపాలెం వద్దకు రాగానే గేదెలు అడ్డుగా వచ్చాయి. దీంతో వాటిని ఢీకొట్టిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గజ్జల శివయ్య (42) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కొర్ర విజయలక్ష్మి (52)ని చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతుల్లో ఒకరైన విజయలక్ష్మి తన భర్త నాయక్‌తో కలిసి విజయవాడ నుంచి కర్నూలుకు వెళ్తోంది. గజ్జల శివయ్య చిల్లలూరిపేటలో బస్సు ఎక్కినట్లు ప్రయాణికులు తెలి పారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.



మృతిచెందిన విజయలక్ష్మి

## రైలు కిందపడి వ్యక్తి మృతి



షేక్ హమీద్ (ఫైల్)

మార్కాపురం రూరల్, జూన్ 21: మార్కాపురం రైల్వే స్టేషన్ పరిధిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి షేక్ హమీద్(54) మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మార్కాపురం టూ ఒంగోలు రోడ్డు పై ఓవర్ కింద ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి మృతి చెందినట్లు గుర్తించామని తెలిపారు. మృతుడు పట్టణంలోని 28వ వార్డుకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు షేక్ హమీద్ ఎల్ఐసీ ఏజెంట్, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పట్టణంలో గుర్తింపు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రైలు కిందపడి ఆత్మహత్య చెందినట్లుగా స్థానికులు పోలీసులు భావిస్తున్నారు. సంఘటన ప్రదేశాన్ని రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ రెడ్డి పరిశీలించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు.

## తర్లుపాడు రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?

● వైసీపీ పాలనలో టెండర్లతోనే సరి
● కూటమి ప్రభుత్వంపైనే ప్రజల ఆశలు

మార్కాపురం, జూలై 21: మార్కాపురం నుంచి తర్లుపాడుకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ రోడ్డు దశ మారడంలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గుంతలు పూడ్చే దిక్కులేక ఈ రహదారి ప్రయాణీకులకు నరకప్రాయంగా మారింది. స్థానిక పూలసుబ్బయ్య కాలనీ నుంచి తర్లుపాడు వరకు ఉన్న 8 కిలోమీటర్ల మేర రోడ్డులో అడుగుకో గుంత దర్శినమిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారుతోంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డును రెండు వరుసల్లో నిర్మిస్తామని 2019 ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. కానీ ఐదేళ్ల కాలంలో పట్టించుకున్న దాఖలాలే లేవు. గత సంవత్సరం చివర్లో మొక్కుబడినా టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ 8 నెలలు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో తర్లుపాడు మండల ప్రజలకు మార్కాపురం చేరుకోవాలంటే తిప్పలు తప్పడంలేదు.

### టెండర్ల వద్దే నిలిచిన పనులు

గతంలో తర్లుపాడు మండలం కంభం నియోజకవర్గ పరిధిలో ఉండేది. అప్పట్లో మార్కాపురం ప్రాంత నాయకులు తర్లుపాడుకు నూతనంగా రోడ్డు నిర్మించేందుకు మొగ్గు చూపలేదు. కానీ 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తర్లుపాడు మండలం మార్కాపురం నియోజకవర్గ పరిధిలోకి వచ్చింది. అప్పట్లో ఎమ్మెల్యేగా టీడీపీకి చెందిన నారాయణరెడ్డి ఉన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ప్రభుత్వం రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోలేదు. అప్పటి నుంచి నేటి వరకు ప్రతిపాదనలు పంపడంతోనే సరిపోయింది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసినా ఎన్నికల సమయం కావడంతో టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఐదేళ్లు పట్టించుకున్న పాపానపోలేదు. 2018 చివర్లో పూలసుబ్బయ్య కాలనీ నుంచి మార్కాపురం మండలం బొడిచెర్ల వరకు 13.4 కిలోమీటర్ల మేర పాత రహదారి స్థానంలో ఒక వరుసతోనే నూతన రోడ్డు నిర్మించేందుకు రూ.4.7 కోట్లతో టెండర్లు పిలిచారు. కానీ గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించడంలో జాప్యం ఏర్పడుతోందన్న కారణంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్‌ను రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు.

### కూటమి ప్రభుత్వం చొరవచూపితేనే..

నియోజకవర్గంలో మార్కాపురం కేంద్రానికి దగ్గరగా ఉన్న మండలం తర్లుపాడు. మండల కేంద్రం నుంచి మార్కాపురానికి దూరం కేవలం 10 కిలోమీటర్లు మాత్రమే. పూల సుబ్బయ్య కాలనీ వరకు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండు వరుసల సీసీ రహదారి నిర్మించారు. అక్కడ నుంచి తర్లుపాడు వరకు పాత బీటీ రహదారి ఉంది. సీతానాగులవరం గ్రామం వద్ద మరో 500 మీటర్ల మేర సీసీ రహదారి నిర్మించారు. తర్లుపాడుకు ప్రస్తుతం 7.5 కిలోమీటర్ల మేర రెండు వరుసల రహదారి నిర్మిస్తే సరిపోతుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం మార్కాపురం నుంచి బొడిచెర్ల వరకు డబుల్ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదిస్తున్నారు.. బొడిచెర్ల నుంచి కంభం వరకు ఇప్పటికే సుమారు 13 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు ఉంది. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. ఈ రోడ్డు మార్కాపురం, కంభం రెండు సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉన్నందున ఉన్నతాధికారులతో చర్చించి ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నియోజకవర్గంలో అత్యంత ఇబ్బందికరంగా ఉన్న రెండు రోడ్లకు ప్రాతిపాదనలు పంపాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవచూపి నిధులు సాధించగలిగితే త్వరలోనే మార్కాపురం-తర్లుపాడు రోడ్డుకు మోక్షం కలుగుతుంది.



గుంతలమయంగా మార్కాపురం- తర్లుపాడు రోడ్డు

## బీజేపీ పటిష్టతకు కృషిచేయాలి



మాట్లాడుతున్న కేవీ రమణయ్య

పామూరు, జూలై 21: కేంద్రంలో మోదీ నాయకత్వాన ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంతోపాటు రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం రావడంలో కూటమి నాయకులు, బీజేపీ కార్యకర్తల కృషి అభినంద నీయమని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. స్థానిక బీ జేపీ కార్యాలయంలో ఆపార్టీ మండల కమిటీ అధ్యక్షుడు జె.చిన సుబ్బయ్య అ ధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నాయకత్వంలో పార్టీ మరింత అభివృద్ధి చెందేలా కార్యకర్తలు కృషి చేయాల న్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్ర జల్లో తీసుకెళ్లి పార్టీ విస్తరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకటసత్యం, కేవీ సుబ్బారావు, పి.అర విండ్, బి.హజరత్‌కుమార్, మాల్యాద్రి, యు.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బారాయుడుకి నివాళి



కొప్పల్లి సుబ్బారాయుడు చిత్రపటంకు నివాళులర్పిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఉగ్ర

పామూరు, జూలై 21: ప్రముఖ న్యాయవాది కొప్పల్లి సుబ్బారాయుడు ప్రథమ వర్థంతి కార్యక్రమాన్ని మండంలోని కోడిగుంపల గ్రామంలో ఆదివారం కుటుంబసభ్యులు నిర్వహించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని సుబ్బారాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ఇరిగినేని రవీంద్రబాబు, సర్పంచ్ డి.కొండబాబు, కావేరి రసూల్, కొప్పల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పరికరాలు చోరీ

పామూరు, జూలై 21: తెల్లరాయి మినరల్స్ ఫ్యాక్టరీలో రూ.9 లక్షల విలువ గలిగిన విద్యుత్ పరికరాలు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని ఇనిమెర్ల గ్రామ జాతీయ రహదారి ప్రక్కనున్న సిద్ధమూర్తి నారాయణరెడ్డికి చెందిన భైరవ మినరల్ ఫ్యాక్టరీలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని గల సుమారు రూ.3 లక్షల విలువ కలిగిన రాగి తీగ, ట్రాన్స్‌ఫార్మర్‌లోని రూ.2 లక్షల విలువ కలిగిన ఆయిల్, 6 కిలో మీటర్‌ల విద్యుత్ కండక్టర్ వైర్‌ను చోరీ చేశారు. ఈమేరకు నారాయణరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

## ఘనంగా అచ్చమాంబకు పొంగళ్లు

పామూరు, జూలై 21: మండలంలోని కమ్మవారిపాలెంలో గల శ్రీఅచ్చమాంబతల్లి పేరంటాల బ్రహ్మోత్సవాల అనంతరం జరుపుకొనే నెల పొంగళ్లను భక్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా పలువురు మహిళా భక్తులు పొంగళ్లను తలపై పెట్టుకొని దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త అడుసుమల్లి చినచెంచయ్య, దేవస్థాన చైర్మన్ అడుసుమల్లి నరసింహులు, దుద్దుకూరి యోగానంద్, మల్లికార్జున, రావెళ్ల వెంకటరత్నం, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన తెలుగుయువత నేత వేణుబాబు

తాళ్లూరు, జూలై 21: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబును కొత్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.తాను గత 15ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ కోసం చేసిన కృషిని ఫైల్ రూపంలో చంద్రబాబుకు అందజేశాడు. చంద్రబాబు ఆ ఫైల్‌ను పరిశీలించి అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 21: మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలోని గోవులకు పూజలు నిర్వహించారు.

## అంధకారంలో ఆర్టీసీ బస్టాండ్

పామూరు, జూలై 21: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి అంధకారం నెలకొంది. దాంతో ప్రయాణికులు చీకట్లో ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ స్తంభం నుంచి మీటర్లలోకి వచ్చే కేబుల్‌వైరుకు తరుచూ అంతరాయం కలుగుతుండటంతో సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ అంతరాయం గురించి పలుమార్లు కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించేవారే కరువైనట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం కావడం, చెరువు దగ్గర్లో ఉండటంతో విషసర్పాలు సంచరిస్తుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా లోపాలను సరిచేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన చిననాసరయ్య

దర్శి, జూలై 21: మండలంలోని అబ్బాయిపాలెంకు చెందిన కొత్తపల్లి చిననాసరయ్య (43) విద్యుత్ షాక్‌తో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. చిననాసరయ్యకు రెండు ఎకరాల 70 సెంట్ల సాగుభూమి ఉంది. ఆ భూమిలో బోరు వేసుకుని పైరు సాగు చేసకుంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం పొగనారు తెచ్చుకుని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యాడు. పొలంలో ఉన్న మోటార్ వేసేందుకు స్విచ్ వేయగా లూజ్ కనెక్షన్ ఉండటంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆకుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది, ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## త్వరలో సాగర్ కాలువలకు మరమ్మతులు

దర్శి, జూలై 21: సాగర్ కాలువలకు మరమ్మతులు త్వరలో చేపడతామని ఎన్‌ఎస్‌పీ ఈఈ పూర్ణచంద్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. అధ్వానంగా సాగర్ కాలువలు శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో నిధుల కొరతతో మరమ్మతుల్లో జాప్యం జరిగిందన్నారు. లష్కర్ల కొరత తీవ్రంగా ఉన్నందున చిల్లచెట్లు తొలగించలేకపోయామన్నారు. రైతులు, సిబ్బంది సహకారంతో చిల్లచెట్లు తొలగించి మేజర్ల గండ్లు పూడుస్తామని ఆయన వివరించారు.

## రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలి

- టీడీపీ ఎంపీలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సూచన

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 21 : రాష్ట్ర హక్కుల కోసం టీడీపీ పార్లమెంట్ సభ్యులు పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలతో ఉన్నారన్నారు. అరాచక, నిరంకుశ పాలన పోయిందని చెప్పుకుంటున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని భావిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వం చంద్రబాబు, నితీష్‌కుమార్‌లపై ఆదారపడి పాలన సాగిస్తున్నదన్నారు. ఇప్పటికే నితీష్‌కుమార్ బిహార్ కోసం ప్రత్యేక హోదా, నిధులు కోరారన్నారు. ఈతరుణంలో చంద్రబాబు మౌనంగా ఉండటం తగదన్నారు. మాజీ సీఎం జగన్ రాజీధోరణి అవలంబించడం వల్లనే మట్టికరిచిపోయారని గుర్తుచేశారు. దీన్ని గుణపాఠంగా తీసుకొని టీడీపీ మేల్కొంటే మంచిదని సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఎంపీలు పోరాడాలని కోరారు. బీజేపీకి మద్దతిచ్చే వైసీపీ కూడా గట్టిగా ఉండాలన్నారు. రాష్ట్రం కోసం ఢిల్లీలో ధర్నాలు చేయాలని, ఇక్కడ ఏమైనా అల్లర్లు, గొడవలు ఉంటే అసెంబ్లీలో చర్చించాలని జగన్‌కు సూచించారు. నాలుగేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు వైసీపీ ప్రభుత్వం రూ.61,500 కోట్లు కేటాయించి కేవలం రూ.32వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని శ్రీనివాసరావు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావసం కల్పించకుండానే గత అక్టోబర్‌లో జగన్ ప్రారంభించారన్నారు. కాలువలు కూడా పూర్తి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాకు రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, జీవీకొండారెడ్డి, ఎస్‌కే మాబు, కంకణాల ఆంజనేయులులు పాల్గొన్నారు.

# వారధి నిర్మాణం జరిగేనా..!

- రెండున్నర సంవత్సరాల క్రితం కూలిన వంతెన
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- కర్రలు కట్టుకొని రాకపోకలు



వంతెనపై కర్రలు ఏర్పాటుచేసుకొని రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

దొనకొండ, జూలై 21: మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కెనాల్‌పై నిర్మించిన వంతెన రెండున్నర సంవత్సరాల క్రితం కూలిపోయింది. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన ఈ వంతెన నిర్మాణం గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు చెందిన దాదాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్ కాలువకు అవతలివైపున ఉంది దీంతో రాకపోకల నిమిత్తం అప్పట్లో కెనాల్‌పై వారధి నిర్మించారు. 2022 ఫిబ్రవరిలో ఇది కాలువలోకి కుప్పకూలింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు రాకపోకలు జరుపుకునేందుకు రెండున్నర సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. వంతెన నిర్మాణం గురించి అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా ఇప్పటివరకు పట్టించుకున్న నాథుడే లేడు.

ప్రతిరోజు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేకపోతున్నారు. దీంతో కూలిన వంతెనపై నడిచి వెళ్లేందుకు నిచ్చెనలా కర్రలు ఏర్పాటుచేసుకొని ప్రమాదకర పరిస్థితుల్లో అటుఇటు రాకపోకలు జరుపుతున్నారు. ఆ సమయంలో ఒకరిద్దరు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పశుపోషకులు తప్పనిసరై పశువులను మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన గుండా ప్రతిరోజు రాకపోకలు జరుపుకుంటున్నారు.

సాగర్ కాలువలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తున్న సమయంలో కూలిన వంతెన పైనుంచి రాకపోకలు జరుపుకునేందుకు కుదరకపోవటంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గేవరకు తప్పనిసరిగా చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లటం తప్పనిసరి. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన సాగర్ కాలువపై వంతెన నిర్మాణం గురించి వైసీపీ పాలకులు, అధికారులు రెండున్నర సంవత్సరాలుగా పట్టనట్టుగా వ్యవహరించారు. సాగర్ కాలువపై వంతెన నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో, తమ ఇబ్బందులు ఎప్పుడు తొలగుతాయోనని ఈప్రాంత ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వంలో వేగవంతంగా వంతెన నిర్మాణం జరిగితే తమ ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

# ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



నూతన ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 21: ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో నూతనంగా చెన్నై, విజయవాడ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కనిగిరి డిపో ఆదాయంలో ముందుండాలన్నారు. డిపోలో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. సుదూర ప్రాంతాలకు కూడా అవసరమైనన్ని బస్సులు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం సుధాకర్‌బాబు, డీఎం శ్రీమన్నారాయణ, ఏఎస్ఎం రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాగా, డిపోలో ప్రయాణికులు, కార్మికులు, సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎన్ఎంయూ నాయకుడు నజీర్ ఎమ్మెల్యే ఉగ్రకు వినతిపత్రం అందజేశారు. డిపోలో నీటి వసతి లేకపోవటంతో ప్రయాణికులతో పాటు కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. బెంగుళూరుకు అదనంగా స్లీపర్ బస్సులు వేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ ఉగ్ర సానుకూలంగా స్పందిస్తూ కనిగిరి అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. బెంగుళూరుకు అదనంగా స్లీపర్ బస్సులు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డిపోలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకుడు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు
- పలుచోట్ల అన్నదానాలు



కనిగిరి: వ్రత మహోత్సవంలో పాల్గొన్న 111 మంది దంపతులు

దర్శి జూలై 21: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. షిర్డి సాయిబాబా దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా మందిరాలను వివిధ రకాలపూలతో అందంగా ఆలంకరించి, సాయిబాబాకు ప్రత్యేక పూజలు, విశేష హారతి కార్యక్రమాలను నిర్వహించారు.

దర్శి మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. పట్టణంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దర్శి పట్టణంలోని ద్వారకామాయి, ఎన్ఏపీ చెరువు వద్ద గల సాయిబాబా ఆలయం, అద్దంకి రోడ్డులోని సాయిబాబా ఆలయం, మండలంలోని సామంతపూడిలోని సాయిబాబా ఆలయంలో వేడుకలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అన్ని ఆలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించటంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**కనిగిరిలో..** కనిగిరి, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం స్థానిక సాయిబాబా దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. బాబాకు మంగళహారతులు నిర్వహించగా, 111 మంది దంపతులు వ్రతమహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా బాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

**పామూరులో..** పామూరు, జూలై 21: పామూరు పట్టణంలోని పాత పోస్టాఫీసు ఎదురుగల సాయిబాబా మందిరంలో ఉదయం కాకడ హారతి, గణపతి పూజ, సాయిబాబా దత్తాత్రేయ గణపతి మూలవిరాట్‌లకు పంచామృత అభిషేకాలను ఆలయ ప జారి చంద్రకాంత్ దివేది ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం హారతి అనంతరం కేసీపీ సిమెంట్ అధినేత్రి



దర్శిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు



తాళ్లూరు: సాయినాథునికి పూజలు చేస్తున్న ఎంపీపీ తాటికొండ, జడ్పీటీసీ మారం, రమణారెడ్డి

వీఎల్ ఇందిరాదత్తు అందించిన ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. సాయంత్రం సంధ్యా హారతి, స్వామివారికి లక్ష పుష్పార్చన, పల్లకి సేవ, సేజ్ హారతి నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వైవీ సాయికిరణ్, దరిశి నరసింహారావు, పి.తిరుపతయ్య, డి.వెంకటసుధాకర్‌రావు, మిరియం రామారావు, గుంటుపల్లి చెంచురామయ్య, తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి దేవస్థానం వద్దగల బాబా మందిరంలోనూ వేడుకలు నిర్వహించారు. తూర్పుకట్టకిందపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లోనూ వేడుకలను నిర్వహించారు.

**దొనకొండలో..** దొనకొండ, జూలై 21: స్థానిక ఆనంద ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలను ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అచలానంద స్వామి వారి పాదుకలకు ఆశ్రమ వాసులచే అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి గురుపూజ మహోత్సవం నిర్వహించి భజనలు చేశారు. అనంతరం భైరవానందస్వామికి భక్తులు సామూహిక హారతులు ఇచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**వెలిగండ్లలో..** వెలిగండ్ల, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలను వెలిగండ్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. మొగళ్ళూరు, రామగోపాలపురంలోని సాయినాథుని ఆలయాలకు ఆదివారం తెల్లవారు జామునుంచే భక్తులు చేరుకొని సాయిబాబాను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో అన్నాధాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మొగళ్ళూరులో సాయిబాబాను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు

**తాళ్లూరులో..** తాళ్లూరు, జూలై 21: మండలంలోని కొత్తపాలెం సాయిమందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని గ్రామాలతో పాటు ఇతరప్రాంతానికి చెందిన వేలాది మందిభక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమ నిర్వహణకు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఐదు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీపీ శ్రీనివాసరావు, శ్రీసరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డిలు సాయినాథునిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల య కమిటీ నిర్వహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వెలుగువారిపాలెంలోని శ్రీసాయిబాబాదేవాలయం ప్రాంగణంలో గురుపూర్ణిమ సందర్భంగా మయూరి నాట్యకళామండలి ఆధ్వర్యంలో పొదిలి, బొద్దికూరపాడు గ్రామాలకు చెందిన చిన్నారులు భరతనాట్య, జానపద నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులకు నిర్వాహకులు మెమొంటోలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ మామిడి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

**ముండ్లమూరులో..** ముండ్లమూరు, జూలై 21: మండలంలోని సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముండ్లమూరు, పసుపుగల్లు, పులిపాడు, నాయుడుపాలెం, పోలవరం, ఈదర గ్రామాల్లో బాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాబా ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

# వైద్య సేవలు అభినందనీయం

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు
- 700 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయడు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 21: కనిగిరి ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం ఉగ్రనరసింహారెడ్డిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, జంషీర్, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరంలో 700 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 458 మందిక కంటి ఆపరేషన్‌లు చేయించాల్సిందిగా శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు గుర్తించారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని విడతల వారీగా గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# పేదల సంక్షేమమే ధ్యేయం

- రైతు బజార్లలో రాయితీపై నిత్యావసర సరుకులు
- వచ్చేనెల 15 నుంచి అన్న క్యాంటీన్‌లు
- రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 21: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. అందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతు బజార్లలో రాయితీపై నిత్యావసర సరుకులను అందిస్తున్నామని తెలిపారు. ఆమేరకు ఆదివారం మంత్రి స్వామి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామన్నారు. ఏ గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల సోనామసూరి బియ్యాన్ని కిలో రూ.48,49 చొప్పున ప్రజలకు ఇస్తున్నామన్నారు.

ఒంగోలులో మూడు చోట్ల, జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లోని రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇవి ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి పేదలు అర్థాకలితో అలమటించారన్నారు. అడ్డూఅదుపు లేకుండా పెరిగిన ధరలను తగ్గించి ప్రజలకు ఊరట కలిగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చేనెల 15నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు కూడా ఏర్పాటుచేసి రూ.5కే పేదల ఆకలి తీరుస్తామని మంత్రి స్వామి తెలిపారు.

## చందవరం స్టోరేజీలకు సాగర్ జలాలు



చందవరం-2 స్టోరేజీలోకి పంపింగ్‌తో చేరుకుంటున్న నీరు

దొనకొండ, జూలై 21: గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ కెనాల్‌కు విడుదలైన జలాలు మండలంలోని చందవరం గ్రామ సమీపంలోకి ఆదివారం చేరుకున్నాయి. దీంతో మండలంలోని చందవరం గ్రామ సమీపంలో ఉన్న చందవరం-1, చందవరం-2 స్టోరేజీలను సాగర్ జలాలతో యుద్ధప్రాతిపదికన పంపింగ్ చేస్తున్నారు. రెండు స్టోరేజీల్లో 20శాతం వరకు మాత్రమే నీరు నిల్వ ఉండటంతో ప్రస్తుతం కెనాల్‌కు సాగర్ జలాలు విడు దలవుతున్న సమాచారంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమై మోటార్లను సంసిద్ధం చేశారు. కెనాల్‌కు నీరు చేరగానే మూడు మోటార్లు ద్వారా స్టోరేజీలకు సాగర్ నీరు పంపింగ్ చేస్తున్నారు. చందవరం-1 స్టోరేజీ పరిధిలో దొనకొండ మండలంలోని 29 గ్రామాలు, చందవరం-2 స్టోరేజీ పరిధిలో కనిగిరి, హనుమంతునిపాడు, కొనకనమిట్ల, సీఎస్‌పురం మండలాల పరిధిలోని 132 గ్రామాల ప్రజలకు నీటి సరఫరా జరుగుతుంది. ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా స్టోరేజీలకు సాగర్ జలాలను పూర్తిస్థాయిలో నింపేందుకు తగిన చర్యలు చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు.

## 'ఉపాధి'లో అవినీతికి పాల్పడినవారిపై చర్యలు

తాళ్లూరు, జూలై 21: మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు డ్వామా పీడీ బి.అర్జునరావు తెలిపారు. ఇటీవల్ల గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ అనంతరం శనివారం తాళ్లూరులో ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా రూ.42 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో 'ఉపాధి పనుల నిధుల దుర్వినియోగం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా నీటియాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జునరావు వివరణ ఇచ్చారు. 16వ విడతసామాజిక తనిఖీ నివేదికల్లో రూ.18 లక్షల 91వేల అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. అందులో రూ.15.33 లక్షల సంబంధించి రికార్డులు చూపిన కారణంగా మిగిలినదానిలో అవినీతి జరిగినట్లు నిర్ధారించినట్టు చెప్పారు. అవినీతికి పాల్పడ్డ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేసినట్టు చెప్పారు.

## సీఎస్‌పురంలో ముగిసిన వేడుకలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 21: మత సామరస్యానికి చిహ్నంగా హిం దూ ముస్లింలు ప్రజలు జరుపుకొనే మొహర్రం వేడుకలు ఆదివారం సీఎస్‌పు రంలో ఘనంగా ముగిసినట్లు ముజావర్లు తెలిపారు. పీర్ల స్నానం సందర్భం గా పీర్ల గుండాన్ని పూడ్చి పీర్లను మేళతాళాలు, తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వ హించారు. స్థానిక చెరువుకట్ట వద్దకు తరలించి పీర్లను నీళ్లతో శుభ్రపరిచారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పీర్లను చావిడిలకు చేర్చారు. దాంతో ఈ ఏడాది పీర్ల పండుగ ముగిసినట్లు ముజావర్లు తెలిపారు. కార్యక్రమాల్లో హిందూ ముస్లిం భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 22 జూలై 2024





# కౌలు బకాయి.. రూ. 380 కోట్లు

- వైసీపీ నిర్లక్ష్యం.. కూటమి కసరత్తు
- రెండేళ్లుగా అమరావతి రైతుల అవస్థలు
- వాయిదాలతో సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం
- ఈ ఏడాదితో ముగియనున్న పదేళ్ల గడువు
- పునరుద్ధరణ చేయాలంటూ రైతుల వినతులు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బువ్వ పెట్టే భూములను రాజధాని అమరావతి కోసం ఇచ్చి ప్రభుత్వం ఇచ్చే కౌలుపై ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారికి కౌలు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం అష్టకష్టాలు పెడుతూ వచ్చింది. ఇప్పటికి వైసీపీ ప్రభుత్వం అమరావతి కౌలు బకాయి రూ.380 కోట్లని తేలింది. రైతులకు గత టీడీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా కౌలు చెల్లింపులు జరిగేవి. దీంతో వారు పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు వినియోగించుకునే వారు. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని అమరావతి రైతులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రాజధానికి భూములు ఇవ్వడమే నేరమన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం రైతులను వేధించిందంటే ఆశ్చర్యం కాదు. ఏటా ఇవ్వాల్సిన కౌలు రైతులకు ఇవ్వకుండా వేధిస్తూ వచ్చింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా హైకోర్టు తలుపు తట్టకుండా రైతులకు కౌలు జమ కాలేదంటే వారిపై గత ప్రభుత్వ వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చివరి రెండేళ్లు కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా వైసీపీ ప్రభుత్వం కౌలు ఎగవేతకు పూనుకుంది.

## కౌలు రాక అగచాట్లు

రాజధాని కోసం 28,656 మంది రైతులు దాదాపు 34 వేల ఎకరాల భూములు ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతుల్లో చాలామంది ఆర్థిక ఇబ్బందులతో రిటర్నబుల్ ప్లాట్లు అమ్ముకోగా వారంతా కౌలుకు అనర్హులయ్యారు. తాజా గణాంకాల ప్రకారం 28,656 మందిలో కేవలం 22,980 మందికి మాత్రమే కౌలు వస్తుంది. వీరిలో 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు, ప్రధానంగా దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, అసైన్డు రైతులే. ఏటా ప్రభుత్వం కౌలు ఆలస్యంగా చెల్లించడంతో ఆయా వర్గాల రైతులు జీవనానికి అప్పులు చేయాల్సి వచ్చింది. గడిచిన రెండేళ్లలో పూర్తిగా కౌలు ఎగవేయడం తో వారు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కనీసం ఇల్లు గడవడం, పిల్లలకు ఫీజు లు కట్టుకోవడం కూడా వారికి భారంగా తయారైంది. కిందటేడాది అప్పులు చేసి ఫీజు లు కట్టినా, ఈ ఏడాది ఆ అవకాశం కూడా లేకపోవడంతో పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని సాధారణ రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరుకుంటున్నారు.

## కౌలు చెల్లింపులపై కసరత్తు

రాజధాని రైతులకు చెల్లించాల్సిన కౌలు విషయమై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతుల నుంచి కౌలు చెల్లింపులపై వినతులు పెరుగుతున్న నేపథ్యంలో పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టారు. రైతులకు ప్రభుత్వం రూ.380 కోట్ల మేర కౌలు బకాయిలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కౌలు బకాయిల అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నెలాఖరులోగా కౌలు చెల్లించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు రాజధాని రైతు జేఏసీ నేతలు చెబుతున్నారు.

### మమ్మల్ని ఆదుకోవాలి



సకాలంలో కౌలు రాకపోవడంతో అప్పులపాలయ్యాం. గడిచిన రెండేళ్లుగా కౌలు ఊసే లేకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పుడు అప్పుపుట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రైతులకు కౌలు చెల్లించి ఆదుకోవాలి.


- కాటా అప్పారావు, తుళ్లూరు రైతు

### పరిస్థితి దారుణం



మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. పూట గడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే కౌలుతో పిల్లల్ని చదివించుకుంటున్నాం. ఇప్పుడు వారికి ఫీజులు కట్టే పరిస్థితి లేదు. కనీసం తినడానికి కూడా అప్పులుచేయాల్సి వస్తోంది.

- మేరిగ నాగేశ్వరరావు, అసైన్డ్ రైతు



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

# కృష్ణమ్మ.. పరవళ్లు

- నిండిన శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు
- శ్రీశైలానికి 96,369 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరదనీరు



జూరాల నుంచి నీటి విడుదల

నరసరావుపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణమ్మ ప్రాజెక్టులను దాటి దిగువకు వడివడిగా వస్తోంది. శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు నిండిపోవడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం దిశగా పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీవర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ఎగువున ఉన్న ఆల్‌మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు నిండాయి. దీంతో వాటి గేట్లు ఎత్తి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 96,369క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో గా వచ్చిచేరుతోంది. ఇది క్రమంగా లక్ష క్యూసెక్కు లు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న పది రోజుల్లో వంద టీఎంసీలకు పైగా నీరు శ్రీశైలానికి వస్తుందని అంచనా. కృష్ణమ్మకు వరదనీరు పోటెత్తుండటంతో సాగర్ ఆయకట్టులో రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రలో 105.78 టీఎంసీలకు 74.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రెండు రోజుల్లో దాదాపు 25 టీఎంసీల నీరు చేరింది. వరద ప్రవాహం ఇలానే కొనసాగితే ఒకటి రెండు రోజుల్లో తుంగభద్ర గేట్లు కూడా తెరిచి దిగువకు నీటి విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్‌కు 2,340 కూసెక్కుల నీరు వస్తుంది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 9,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...**

| జలాశయం | పూర్తిస్థాయి నీటినిల్వ | ప్రస్తుత నీటినిల్వ | వస్తున్న వరదనీరు | విడులచేస్తున్న నీరు |
|---|---|---|---|---|
| | టీఎంసీలలో | | క్యూసెక్కుల్లో | |
| ఆలమట్టి | 123.08 | 96.30 | 87,217 | 1,00,064 |
| నారాయణపూర్ | 33.31 | 28.90 | 96,063 | 1,08,773 |
| జూరాల | 9.66 | 7.04 | 76,166 | 84,444 |
| తుంగభద్ర | 105.78 | 74.58 | 1,12,101 | 2,464 |
| శ్రీశైలం | 215.81 | 39.15 | 96,369 | నిల్ |
| నాగార్జునసాగర్ | 312.05 | 122.52 | 2,340 | 9,882 |
| పులిచింతల | 45.77 | 0.82 | 640 | 50 |

## బ్యారేజీ నుంచి 12,300 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్: ప్రకాశం బ్యారేజి దిగువకు వరదనీటి విడుదల కొనసాగుతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి బ్యారేజికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర, తదితర వాగుల నుంచి 13వేల 600 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 17 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 12 వేల 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

# అమెరికా వెళ్లి.. అనంతలోకాలకు

- తెనాలికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి
- రోడ్డు ప్రమాదంలో ఒకరు.. ప్రమాదవశాత్తు మరొకరు..
- తమ పిల్లల దేహాలను ఇప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు
- స్పందించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్





జెట్టి హారిక (ఫైల్)

శోకసంద్రంలో హారిక తల్లి, బంధువులు

తెనాలి(ఆంధ్రజ్యోతి), తెనాలి రూరల్, జూలై 21: అమెరికాలో ఉన్నత చదువులతో భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనుకున్న వారి కలలు కల్లలుగా మిగిలాయి. ఉన్నత చదువులతో ఎంతోఎత్తుకు తమ పిల్లలు ఎదుగుతారని ఆశించిన ఆ తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. స్తోమత లేకపోయినా పిల్లలు అమెరికాలో చదువుకుని ప్రయోజకులై తిరిగి వస్తారనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలపై పిడుగులు పడ్డాయి. రెక్కలు ముక్కలు చేసి కూడబెట్టి, మరికొంత అప్పులు చేసి పిల్లల్ని అమెరికాకు పంపగా సంవత్సరం గడిచిందోలేదో వారు అనంతలోకాలకు చేరారని తెలిసి ఆ కుటుంబాలు తీవ్రవిషాదంలో మునిగిపోయాయి. రోజుల వ్యవధిలో అమెరికాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో తెనాలి ఐతానగర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఓ స్విమ్మింగ్‌పూల్‌లో పడి తాడిబోయిన రవితేజ(28) రెండురోజుల క్రితం మరణించగా శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో జెట్టి హారిక(25) మృతిచెందింది. రోజులవ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో తెనాలివాసులు విషాదంలో మునిగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఐతానగర్‌కు చెందిన జెట్టి శ్రీనివాసరావు దేవదాయశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఆయనకు హారికతోపాటు మరో కుమారుడున్నారు. ఇద్దరిలో పెద్దదైన హారిక ఉన్నత చదువుకు అమెరికా పంపారు. సామాన్య కుటుంబమే అయినా కుమార్తె కోరిక తీర్చేందుకు తండ్రి అప్పు చేసి పంపించారు. హారిక యూనివర్సిటీ నుంచి శనివారం కారులో ఇంటికి వెళ్తుండగా లోగాన్ కౌంటీలోని ఒక్లహోమా హైవే పెట్రోల్ -74 దగ్గర వరసగా మూడు కార్లు ఢీకొనడంతో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హారిక అక్కడికక్కడే మరణించింది. ఈ ప్రమాదం శనివారం జరిగితే, ఆదివారం ఉదయం యూనివర్సిటీ నుంచి తమకు సమాచారం అందిందని ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నాగమణిలు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు. మృతదేహం గురించి ప్రాధేయపడితే మంచు కారణంగా ఘటనా స్థలికి వెళ్లడం సాధ్యం కావడంలేదని అక్కడున్నవారు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్తె మృతదేహాన్ని తెనాలి తీసుకొచ్చేందుకు కేంద్ర సహాయమంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, మనోహర్‌లు సహకరించాలని వారు వేడుకున్నారు.

## స్విమింగ్‌పూల్‌లో జారిపడి రవితేజ..

తెనాలి ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన శ్రీనివాసరావు, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కౌలు రైతుగా ఉన్న శ్రీనివాసరావు ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించటంతో కుటుంబ భారాన్ని తనపై వేసుకున్న తల్లి వ్యవసాయ కూలిపనులు చేసుకుని ఇద్దరు బిడ్డల్ని చదివించింది. స్తోమత లేకపోయినా పెద్దకుమారుడు రవితేజ అమెరికాలో ఎంఎస్ చదువుకుంటానంటే అప్పులుచేసి పంపారు. గత సంవత్సరం అమెరికా వెళ్లిన రవితేజ టెక్సాస్‌లోని ఆస్టిన్ నగరంలో చదువుతూ అక్కడే ఉంటున్నాడు. మూడురోజుల క్రితం మరో మిత్రుడితో కలసి దగ్గర్లోని స్విమింగ్‌పూల్‌కు వెళ్లాడు. పూల్‌లో ప్రమాదవశాత్తు జారి పడిపోయి రవితేజ మృతిచెందాడు. ఈ విషయాన్ని రెండురోజుల తర్వాత అక్కడివారు తెనాలిలోని తల్లికి సమాచారం అందించారు. అప్పటినుంచి రవితేజ తల్లి జయలక్ష్మి కన్నీరుమున్నీరవుతున్నారు. భర్త చనిపోయినా కుమారుడి చదువు ఆగకుండా తాను వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ అమెరికా పంపానని, ఉన్నత చదువులు చదివి తిరిగి వస్తాడనుకుంటే తిరిగిరాని లోకాలకు వెళ్లాడంటూ ఆమె విలపిస్తోంది. మృతదేహాన్ని తెనాలికి తీసుకొచ్చే స్తోమత తమకు లేదని, ప్రభుత్వం సహకారం అందించాలని ఆమె వేడుకున్నారు.

## ఆందోళన వద్దు.. ప్రయత్నాలు చేస్తున్నాం

అమెరికాలో మరణించిన విద్యార్థుల మృతదేహాలను తెనాలి తీసుకొచ్చే విషయంలో వారి తల్లిదండ్రుల అభ్యర్థనలపై స్పందించి పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే అమెరికాలోని అధికారులతో మాట్లాడారు. ఇండియన్ కమ్యూనిటీ ప్రతినిధులు, అక్కడే ఉంటున్న తెనాలివాసుల నుంచి పరిస్థితి తెలుసుకున్నారు. స్వదేశానికి మృతదేహాలను తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్‌లు హారిక తల్లిదండ్రులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. రవితేజ మృతదేహాన్ని కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏ ఇబ్బంది లేకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు.



విషాదంలో రవితేజ తల్లి జయలక్ష్మి



రవితేజ(ఫైల్)

# పైసల్లేవు.. పనులెలా?

- పల్లెల్లో కుంటుపడిన పారిశుధ్యం
- వర్షాలతో అధ్వానంగా మారిన దుస్థితి
- కనీసం బ్లీచింగ్ చల్లలేనిస్థితిలో పంచాయతీలు
- 1172 పంచాయతీలకు రావాల్సిన నిధులు రూ.42 కోట్లు

మురుగు.. చెత్త చెదారాలు.. దోమలు.. అపరిశుభ్రత.. తాగునీరు కలుషితం.. డయేరియా.. జ్వరాలతో పడకేసిన పల్లెలు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లెల పరిస్థితి. దీనికితోడు రెండు మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో పంచాయతీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. బురద.. మురుగు.. అధ్వాన పారిశుధ్యంతో పల్లెజనం అల్లాడిపోతున్నారు. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే కనీసం బ్లీచింగ్ చల్లలేని దుస్థితిలో పంచాయతీలు ఉన్నాయి. అపరిశుభ్రత తాండవిస్తున్నా.. కనీస చర్యలు తీసుకునేందుకు అవసరమైన నిధులు లేక పంచాయతీ పాలకవర్గాలు నిస్తేజంగా ఉన్నాయి. ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో అవస్థలు పడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి పంచాయతీలది. ఆర్థిక సంఘం నిధులు కోసం పంచాయతీలు ఎదురు చూస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వర్షాలతో గ్రామాల్లో పరిశుభ్రత కుంటుపడింది. రోడ్లపైనే నీరునిలిచి బురదగా మారగా దీనికి చెత్తాచెదారాలు, మురుగు తోడవడంతో పల్లెల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. దోమల వ్యాప్తి ఉధృతమవుతోంది. నిధుల లేమితో పారిశుధ్య పనులు అటకెక్కాయి. ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజలు వ్యాధుల బారినపడే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడనున్నాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లు నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను మార్చిలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని నిధుల వినియోగానికి కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిన విషయం తెలిసిందే.

## నిధుల విడుదలపై కూటమి ప్రభుత్వం ఆశ..

ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆర్థిక సంఘం నిధుల కోసం పంచాయతీ పాలకవర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 1172 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రూ.42 కోట్లు విడుదల చేయాలి. నిధుల కోసం పాలక వర్గాలు ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి వినతి పత్రాలను అందజేశాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో సాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని అప్పట్లో కేంద్రం ప్రభుత్వం సూచించింది. ఈ పనులు ప్రస్తుతం గ్రామాల్లో తక్షణావసరం. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను తిరిగి పంచాయతీలకు జమ చేయాలని కూటమి ప్రభుత్వ నేతలకు పంచాయతీ పాలకవర్గాలు కోరాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తాగు నీరు కలుషితం అవుతోంది. డయేరియా ప్రబలే ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యర్థాల నిర్వహణ లేక పోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగు కాల్వల పూడిక తీతకు నోచుకోవడంలేదు. దీంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు, బురదలతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నిధుల కొరతతో ఆయా పనులు చేపట్టే పరిస్థితులు గ్రామాల్లో కానరావడంలేదు. మున్సిపాల్టీల్లో మురుగు, వరద నీటి కాల్వల్లో పూడికతీత కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. అదే పనుల కోసం పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదు. కనీసం పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను వెనువెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.



గ్రామాల్లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

# వందేళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం


- 705 మంది రైతులకు ప్రయోజనం
- ఇనాం భూములపై లభించనున్న హక్కు
- మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో కదిలిన అధికారులు
- స్వాతంత్ర్య దినోత్సవం రోజు పంపిణీకి కసరత్తు



సంతమాగులూరు తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ సుబ్బారావు, ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, జూలై 21: తాతల నాటి భూ సమస్యకు పరిష్కారం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. సంతమాగులూరు మండలంలో గోపాపురం (డీ పాపులేటెడ్ విలేజ్) రెవెన్యూలో 1071.61 ఎకరాల ఇనాం ఎస్టేట్ భూమి ఉంది. అగ్రహారం పట్టా కింద 891.41 ఎకరాల భూమి ఉంది. గోపాపురం రెవెన్యూ పరిధిలోని భూమిని 705 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. అయితే ఆ భూమిపై రైతులకు ఎలాంటి హక్కులు లేవు. దీంతో వ్యవసాయ రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం లేకుండా పోయింది. వందేళ్లకు పూర్వం నుంచి ఈ సమస్య రైతులను వేధిస్తోంది. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో గతంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దృష్టి సారించారు. ఈ క్రమంలో 2019కి ముందు కొంత మేర అధికారులు కసరత్తు చేసినా.. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా మంత్రి పదవి చేపట్టిన గొట్టిపాటి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. దీంతో ఇటీవల జేసీ సుబ్బారావు ఆధ్వర్యంలో సంతమాగులూరులో రైతులతో సమావేశం నిర్వహించి ఇనాం భూములపై చర్చించారు. ఆ భూమికి సంబంధించి రైతులకు రైత్వారీ పట్టా ఇవ్వవచ్చా అని నిర్ధారించారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున 705 మంది రైతులకు రైత్వారీ పట్టాలు ఇచ్చేలా రెవెన్యూ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

### రుణం తీసుకునే అవకాశం లేదు



గోపాపురం రెవెన్యూ పరిధిలో 1.17 ఎకరాల భూమి ఉంది. ఇనాం భూమి కావడంతో భూమి సాగు చేసుకోవడం మినహా కనీసం పంట రుణం తీసుకునే అవకాశం లేదు. తాతల కాలం నుంచి ఇదే పరిస్థితి. మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టితో సమస్యకు పరిష్కారం వస్తుందన్న నమ్మకం కలిగింది.

- జాగర్లమూడి రామకోటేశ్వరరావు, కామేపల్లి

### ఎంతో ఆనందంగా ఉంది



ఇనాం భూమికి రైత్వారీ పట్టాలు రానుండడం ఎంతో ఆనందంగా ఉంది. గతంలో పలుమార్లు ప్రయత్నాలు జరిగినా ఆచరణ రూపం దాల్చలేదు. రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రస్తుతం రెవెన్యూ అధికారులు వడివడిగా పనులు చేస్తున్నారు.

- దేవినేని మంగేశ్వరరావు, అడవిపాలెం

# కుంట భూమిపై కన్ను

**దర్శి ప్రాంతంలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలతో కలిసి ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, కుంటలను కాజేసిన వారు ఇప్పుడు కూడా ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో ఉన్న రూ.6కోట్ల విలువైన కుంట భూమిపై కన్నేసిన వారు దాన్ని కొట్టేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కుంట కట్టను ధ్వంసం చేశారు. కొంత భూమిని కూడా చదును చేశారు. రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా పేరు నమోదు చేయించుకొని మొత్తం స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారు. వారికి రెవెన్యూ అధికారులు సంపూర్ణంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.**

- కట్టను ధ్వంసం చేసిన అక్రమార్కులు
- రికార్డుల్లో కుంట స్థానంలో ఒక వ్యక్తిపేరు నమోదు
- దాని విలువ రూ.6కోట్లపైనే!
- రెవెన్యూ అధికారుల సంపూర్ణ సహకారం

దర్శి, జూలై 21 : దర్శి ప్రాంతంలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలతో కలిసి ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, కుంటలను కాజేసిన వారు ఇప్పుడు కూడా ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో ఉన్న రూ.6కోట్ల విలువైన కుంట భూమిపై కన్నేసిన వారు దాన్ని కొట్టేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కుంట కట్టను ధ్వంసం చేశారు. కొంత భూమిని కూడా చదును చేశారు. రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా పేరు నమోదు చేయించుకొని మొత్తం స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారు. వారికి రెవెన్యూ అధికారులు సంపూర్ణంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**గతంలో 6.5 ఎకరాల్లో కుంట**

దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో దర్శి-పొదిలి ప్రధాన రహదారిని ఆనుకొని 6.5 ఎకరాల కుంట భూమి



ఆక్రమించి చదును చేసిన కుంట భూమి

ఉంది. రికార్డుల్లో తక్కెటకుంట అని స్పష్టంగా నమోదైంది. గతంలో ఆప్రాంత రైతులు అరకలు దున్నిన తర్వాత మధ్యాహ్నం ఎడ్లతోపాటు అక్కడ సేదదీరేవారు. ఎద్దులకు మేత వేసుకొని ఆ కుంటలో నీరు తాపుకొని సాయంత్రం మళ్లీ అరకలు కట్టి సేద్యం చేసుకునే వారు. ఆ విధంగా ఆ కుంట రైతుల అవసరాలకు ఎంతోకాలంగా ఉపయోగపడింది. సాగర్ కాలువ వచ్చిన తర్వాత ఆ భూములన్నీ మాగాణిగా మారిపోయాయి. ఆతర్వాత కుంట నీటితో పనిలేకుండా పోయింది. దీంతో కొంతమంది రైతులు కుంటలో కొంత భాగాన్ని కలుపుకొని సాగు చేసుకుంటున్నారు. మరికొంతమంది కొందరు చదును చేసుకొని ఇటుక వ్యాపారం చేసుకుంటున్నారు. ఇంకా ఎకరానికి పైగా కుంట భూమి ఖాళీగా ఉంది. దానిపై కన్నేసిన వైసీపీ నేత ఒకరు దాన్ని ఆక్రమించేందుకు కొద్దినెలల క్రితం ప్రయత్నించాడు. కుంట కట్టను కొంత మేర తొలగించాడు. దీంతో ఇప్పటికే అక్కడ భూములను అనుభవిస్తున్న వారికి, ఆయనకు మధ్య వివాదం నెలకొంది. వైసీపీ నాయకుడు ఒకవర్గం వారిపై దాడి చేసి గాయపర్చాడు.

**తెరపైకి కొత్తవ్యక్తులు**

ఇప్పటికే వైసీపీ నేతకు, భూములు అనుభవిస్తున్న ఎస్టీలకు మధ్య వివాదం కొనసాగుతుండగా ప్రస్తుతం కొత్త వ్యక్తులు తెరపైకి వచ్చారు. రికార్డుల్లో తమ పూర్వీకుల పేరు ఉందని మొత్తం కుంటభూమిపై తమకే హక్కు ఉందని కొద్దిరోజులుగా హల్‌చల్ చేస్తున్నారు. దీంతో వారు ఏ ధైర్యంతో ఇక్కడకు వచ్చారన్న విషయంపై ఆరా తీయగా రెవెన్యూ రికార్డుల్లో కొత్త పేర్లు నమోదైన విషయం వెల్లడైంది. ఎఫ్ఎల్ఆర్ రికార్డుల్లో తక్కెటకుంట అనే పేరును రౌండప్ చేసి బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అనే పేరును నమోదు చేశారు. ఎంతోకాలంగా అది కుంటభూమి అని అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ ఇటీవల కాలంలో రికార్డుల్లో ఆపేరు ఎలా చేరిందో అర్థం కావటం లేదు.

**తెరపైకి కొత్తవ్యక్తులు**

ఇప్పటికే వైసీపీ నేతకు, భూములు అనుభవిస్తున్న ఎస్టీలకు మధ్య వివాదం కొనసాగుతుండగా ప్రస్తుతం కొత్త వ్యక్తులు తెరపైకి వచ్చారు. రికార్డుల్లో తమ పూర్వీకుల పేరు ఉందని మొత్తం కుంటభూమిపై తమకే హ



కుంటకట్టను తెగ్గొట్టిన అక్రమార్కులు

క్కు ఉందని కొద్దిరోజులుగా హల్‌చల్ చేస్తున్నారు. దీంతో వారు ఏ ధైర్యంతో ఇక్కడకు వచ్చారన్న విషయంపై ఆరా తీయగా రెవెన్యూ రికార్డుల్లో కొత్త పేర్లు నమోదైన విషయం వెల్లడైంది. ఎఫ్ఎల్ఆర్ రికార్డుల్లో తక్కెటకుంట అనే పేరును రౌండప్ చేసి బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అనే పేరును నమోదు చేశారు. ఎంతోకాలంగా అది కుంట భూమి అని అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ ఇటీవల కాలంలో రికార్డుల్లో ఆపేరు ఎలా చేరిందో అర్థం కావటం లేదు.

**పక్కా ప్రణాళిక**

దర్శి-పొదిలి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న తక్కెటకుంట భూమి విలువ ప్రస్తుతం రూ.6 కోట్లకు పైగా ఉంది. పక్కన ఉన్న పొలాలను వ్యాపారులు ఎకరం కోటి రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అక్కడ లేఅవుట్లు కూడా వేశారు. దీంతో 6.6 ఎకరాల కుంటభూమి విలువ విపరీతంగా పెరగటంతో మొత్తం భూమి కొట్టేసేందుకు కొందరు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. అధికారులను లోబర్చుకొని రికార్డుల్లో బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పేరు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా.. కుంట భూమి రికార్డుల తారుమారు విషయం తమకు తెలియదన్నారు. తాను ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చానన్నారు. అంతకుముందు ఎప్పుడు జరిగిందో తనకు తెలియదని చెప్పారు. రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అందరికీ దగ్గరగా ఉంటా!



ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కును అందజేస్తున్న బీసీ సెల్ ఫౌండేషన్ సభ్యులు

చీరాల, జూలై 21: అంచెలంచెలుగా ఎదిగి.. అందరికి దగ్గరగా ఉంటానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. రోటరీ కమ్యూనిటీ హాలులో ఆదివారం రాత్రి బీసీ కులాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రాజకీయాలలో సర్పంచ్ నుంచి ప్రస్థానం మొదలయ్యిందన్నారు. బీసీ భవన్ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం కొండయ్యను ఘనంగా సన్మానించారు. బీసీ సెల్ ఫెడరేషన్ ప్రతినిధులు 40 మంది కలిసి రూ.55 వేల చెక్కును అమరావతి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ కులాల ప్రతినిధులు న్యాయవాది మస్తాన్‌రావు, యానాదిరావు, పి.కొండయ్య, పేరాల జనార్దన్, వీరాస్వామి, ప్రకాశరావు, నాగేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

మండల పరిధిలోని పాతచీరాలలో ఆదివారం గ్రామ మహిళలు అద్దంకమ్మ తల్లికి సారె చెల్లింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కొండయ్య అద్దంకమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చికెన్‌తో భోజనం

- ఉపాధ్యాయుడి దాతృత్వానికి అభినందనలు



రమేష్‌బాబు

అద్దంకి, జూలై 21: తల్లిదండ్రులు ఇద్దరు ఉపాధ్యాయులుగా పనిచేసిన పాఠశాల, తాను చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే అవకాశం అనపర్తి రమేష్‌బాబుకు వచ్చింది. సొంత ఊరిపై మమకారంతో విద్యార్థుల్లో తనవంతు సాయపడాలన్న ఉద్దేశంతో నెలానెలా చికెన్ కూరతో మధ్యాహ్న భోజనం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అద్దంకి మండలంలోని మోదేపల్లిలో అంతర్భాగంగా ఉన్న నన్నూరపాడు (మోదేపల్లి ఏఏ) ప్రాథమిక పాఠశాలలో 2023జూన్‌లో అనపర్తి రమేష్‌బాబు ఉపాధ్యాయునిగా చేరారు. సొంత గ్రామం కావడంతో పాటు అదే పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఆయన చదవడంతోపాటు తల్లిదండ్రులు రాజమ్మ, సుబ్బారాయుడు కూడా అదే పాఠశాలలో టీచర్లుగా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలకు వచ్చినప్పటి నుంచి గత ఏడాది జూన్ నుంచీ ప్రతి నెలలో ఒకరోజు 30 విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చికెన్ కర్రీని అందిస్తున్నారు. విద్యార్థులపై ఉపాధ్యాయుడు రమేష్‌బాబు చూపుతున్న శ్రద్ధపట్ల గ్రామస్థులు అభినందిస్తున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సిద్ధం

ఒంగోలు (విద్య)., జూలై 21: ప్రభుత్వరంగ విద్యా సంస్థల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సిద్ధమయ్యాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోని గోడౌన్లకు ఆదివారం నాటికి చేరాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేస్తారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా సోమవారం నుంచి వీటిని మండల స్థాయి స్టాకు పాయింట్లకు చేరుస్తారు. ఈనెల 24 నాటికి మండల పాయింట్ నుంచి కళాశాలలకు చేర్చి సంబంధిత ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు పంపిణీ చేస్తారు. నా లుగేళ్ల తర్వాత ఎట్టకేలకు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందుతు న్నాయి.

## ట్రావెల్స్ బస్సు బోల్తా.. ఇద్దరు మృతి

మార్కాపురం రూరల్, జూన్ 21 : గేదెలను ఢీకొని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడటంతో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెం వద్ద అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నుంచి అనంతపురానికి ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి బయల్దేరింది. అందులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు తిప్పాయపాలెం వద్దకు రాగానే గేదెలు అడ్డుగా వచ్చాయి. దీంతో వాటిని ఢీకొట్టిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గజ్జల శివయ్య (42) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కొర్ర విజయలక్ష్మి (52)ని చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతుల్లో ఒకరైన విజయలక్ష్మి తన భర్త నాయక్‌తో కలిసి విజయవాడ నుం చి కర్నూలుకు వెళ్తోంది. గజ్జల శివయ్య చిలకలూరిపేటలో బస్సు ఎక్కినట్లు ప్రయాణికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు.

## ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు

- మంత్రి డాక్టర్ స్వామి



నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 21 : ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఉద్యోగుల భద్రత, సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆదివారం ఒంగోలు డిపోలో రెండు స్టార్‌లైన్, మూడు సూపర్ లగ్జరీ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, సౌకర్యం దృష్ట్యా కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి తీసుకొస్తున్నామని చెప్పారు. పదిరోజుల్లోనే జిల్లాలో నాలుగు స్టార్‌లైన్, ఐదు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించామన్నారు. విడతల వారీగా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల అమలుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. మహిళల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలుకు విధివిధానలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎం బి.సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఒంగోలు రీజియన్‌కు కాలం చెల్లిన బస్సుల స్థానంలో 67 కొత్తవి వచ్చాయన్నారు. సుమారు 20 నుంచి 25 శాతం కొత్త బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు, టీడీపీ మద్దిపాడు మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబుతోపాటు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**పేదల సంక్షేమమే ధ్యేయం**

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 21: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి డాక్టర్ స్వామి తెలిపారు. అందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతు బజార్లలో రాయితీపై నిత్యావసర సరుకులను అందిస్తున్నామని తెలిపారు. ఆమేరకు ఆదివారం మంత్రి స్వామి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామన్నారు. ఏ గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల సోనామసూరి బియ్యాన్ని కిలో రూ.48,49 చొప్పున ప్రజలకు ఇస్తున్నామన్నారు. ఒంగోలులో మూడు చోట్ల, జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, మండల కేంద్రా ల్లోని రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇవి ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అ వకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 15నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు కూడా ఏర్పాటుచేసి రూ.5కే పేదల ఆకలి తీరుస్తామని తెలిపారు.

# మహిళలతో మసాజ్

- స్పా సెంటర్‌లలో నిర్వాకం
- ఒంగోలులో పోలీసుల దాడులతో వెలుగులోకి..
- నాలుగు కేసులు నమోదు.. తొమ్మిది మంది అరెస్టు
- ఏడుగురు యువతులు హోంకు తరలింపు
- పరారీలో వైసీపీ యువనేత అనుచరుడు




విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఒన్‌టౌన్, టూటౌన్, తాలూకా సీఐలు

ఒంగోలు (క్రైం), జూలై 21 : నగరంలోని కొన్ని స్పా సెంటర్‌లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. వాటిలో మహిళలతో పురుషులకు మసాజ్‌లు చేయిస్తున్నారు. ఈ విషయం పోలీసుల దాడుల్లో వెలుగులోకి వచ్చింది. మూడు స్పా సెంటర్‌ల నిర్వాహకులతోపాటు ఒక రిసెప్షనిస్టు, వాటిలో మసాజ్ చేయించుకుంటున్న ఐదుగురు పురుషులు కలిపి మొత్తం తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు కేసులు నమోదు చేశారు. ఒకరు పోలీసులకు పట్టుబడిన కొద్దిసేపటికే తప్పించుకొని పరారయ్యాడు. ఆయా సెంటర్‌లలో అదుపులోకి తీసుకున్న ఏడుగురు యువతులను హోంకు తరలించారు. వివరాలను ఆదివారం ఒంగోలు ఒన్‌టౌన్‌లో సీఐలు జగదీష్, అల్లీసాహెబ్, ఖాజావలి సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వారి కథనం మేరకు.. నగరంలో మొత్తం 16 స్పా సెంటర్లు నడుస్తున్నాయి. అందులో ఆరు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. వాటిలో మూడింటిపై శనివారం రాత్రి దాడులు చేశారు. అక్కడ పురుషులకు మహిళలు మసాజ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఇది చట్టరీత్యా నేరం. గుంటూరు రోడ్డులో సౌరబ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌లో ఐదుగురు మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారితో అక్కడ మసాజ్ చేయించుకుంటున్న నలుగురు పురుషులతోపాటు, నిర్వాహకుడు కిమిడి పవన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐలు వెల్లడించారు. అక్కడ మసాజ్ చేయించుకుంటూ దొరికిన ఓ యువకుడు తప్పించుకున్నాడు. స్థానిక అంజయ్య రోడ్డులోని ఎస్ఎస్ సెలూన్, స్పా సెంటర్‌లో మసాజ్ చేస్తున్న ఓ మహిళ, మరో యువకుడితోపాటు నిర్వాహకుడు తురిమెళ్ల పోతురాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. బాలాజీరావుపేటలో ఓరేంజ్ సెలూన్, స్పా సెంటర్‌లో ఒక మహిళ, మసాజ్ చేయించుకుంటున్న వ్యక్తితోపాటు నిర్వాహకుడు కొణిజేటి కన్నయ్య, రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న మరో మహిళపై కేసు నమోదు చేశామని తెలిపారు. మూడు చోట్లా అదుపులోకి తీసుకున్న ఏడుగురు మహిళలను హోంకు తరలించామన్నారు. మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. పరారైన మాటూరి ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నామని తెలిపారు. కాగా ప్రతాప్‌రెడ్డి వైసీపీ యువనేత అనుచరుడు. ఆయన పట్టుకొన్న కొద్దిసేపటికే తప్పించుకొని వెళ్లాడని పోలీసులు చెప్పడం పలు అనుమానాల కు తావిస్తోంది.

## పేద కుటుంబాలకు టీడీపీ చేయూత

- రూ.5 లక్షలకు పైగా సాయమందించిన కోటపాటి
- ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో సేవలు



కుమార్తె చదువుకు సాయం అందజేస్తున్న టీడీపీ నేత సురేష్, గ్రామస్థులు

మార్టూరు, జూలై 21: ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సొంతగ్రామం మండలంలోని కోనంకి గ్రామంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదకుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తున్నది. గ్రామంలోని పార్టీ నాయకులు కోటపాటి సురేష్ దాదాపుగా 15 పేద కుటుంబాలకు నేనున్నానంటూ, వారి సమస్యలను తెలుసుకొని వారికి రూ.5 లక్షలపైగా నగదును అందజేశారు. శనివారం రాత్రి బాధిత కుటుంబాలకు సురేష్ స్వయంగా సాయాన్ని అందజేశారు. కోనంకిలో 2014, 2019లో జరిగిన అ సెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ మధ్య గట్టిపోటీ ఉంది. తాజా ఎన్నికల నాటికి కోనంకిలో రాజకీయపరంగా చాలా మార్పులు జరిగాయి. వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, పారిశ్రామికంగా, ఆర్థికంగా, సామాజికంగా నష్టం జరిగిందని, ఈ పరిస్థితి నుంచి రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో గ్రామంలోని ప్రధాన వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. పర్చూరు చరిత్రలో భారీ మెజారిటీతో ఏలూరి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో కోనంకి వాసుల ఆనందానికి పట్టపగ్గాలేకుండా పోయింది.

ఈనేపథ్యంలో గ్రామంలో తెలుగుదేశం పార్టీ ప్రతి పేదకుటుంబానికి అండగా ఉంటుందనే భరోసాను కల్పించాలని ఎమ్మెల్యే ఏలూరి సూచనల మేరకు కోటపాటి సురేష్ 15 కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారు. వారిలో ఎంసీఏ చదువుతున్న తాళ్లూరి సాల్మన్‌కు ఫీజుల నిమిత్తం రూ. 45వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న కోటిపల్లి ఆంజనేయులు కుమార్తె వైద్యానికి రూ.లక్ష, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ముట్లూరి చినబాబుకు రూ.25వేలు, అనారోగ్యంతో బాధపడతూ మృతిచెందిన తాళ్లూరి అక్కమ్మ కుటుంబానికి రూ.10 వేలు, అమర్తలూరి వనజాక్షికి రూ.10 వేలు, తాళ్లూరి యాకోబుకు రూ.10వేలు, తాళ్లూరి సత్యానందంకు రూ.15 వేలు, తాళ్లూరి నాగార్జునకు రూ.20వేలు, దేవరకొండ నాగేశ్వరరావుకు రూ.10వేలు, తాళ్లూరి రామారావుకు రూ.20వేలు, జొన్నలగడ్డ సునీతకు రూ.20వేలు, అడవి రోహిత్ (పెద్దిరాజు)కు రూ.15వేలు, యలగాల శ్రీనివాసరావుకు రూ.20వేలు ఇంకా పలుకుటుంబాలకు సురేష్ ఆర్థిక సాయం అందచేశారు. గ్రామంలోని సచివాలయానికి రూ.20వేల విలువైన జిరాక్స్ మిషన్ అందజేశారు. రైతుల పొలాలకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, కనెక్షన్‌ల మంజూరుకు కృషి చేస్తామని సురేష్ హామీ ఇచ్చారు.

# ఇదే మంచి సమయం!

**ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు, తక్షణ ప్రజా అవసరాలపై శాసనసభ్యులు తొలి అడుగు వేసే సమయం ఆసన్నమైంది. అందుకు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ సమావేశాలు వేదిక కానున్నాయి. మాట్లాడే అవకాశం వచ్చినా, రాకున్నా అందుబాటులో ఉండే మంత్రులు, అధికారులకు సమస్యలు వివరించే అవకాశం వారికి లభిస్తుంది. ఆదిశగా ఎమ్మెల్యేలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. అలాగే సమస్యలను సావధానంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రజానీకం కోరుతోంది.**

- సమస్యలు వినిపించాలి, వివరించాలి
- అందరూ అందుబాటులో ఉండేది ఇప్పుడే
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- టీడీపీ ఎమ్మెల్యేలపై ప్రజల ఆశలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు:

ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు మొత్తం ఒకే సమయంలో అందుబాటులో ఉండేది అసెంబ్లీ సమావేశాల సమయంలోనే. వారంతా సమావేశం జరిగే సమయంలో అసెంబ్లీలో, ఆతర్వాత సచివాలయంలోని తమ కార్యాలయాల్లో ఉంటారు. ఎలాగూ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలి కాబట్టి వారందరినీ కలిసేందుకు వీలవుతుంది. గత ఏప్రిల్‌లో గెలుపొందిన ప్రస్తుత ఎమ్మెల్యేలు బాధ్యతలు చేపట్టడం, అభినందనలు అందుకోవడమే ఇప్పటి వరకూ సాగింది. స్థానికంగా అధికారుల బదిలీలపై దృష్టి సారించారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కొన్ని సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని నియోజకవర్గాలలో కొన్నింటి పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల అసలు కర్తవ్యం ఇంకా ప్రారంభం కాలేదని చెప్పుకోవాలి. ప్రస్తుత అసెంబ్లీలో టీడీపీ కూటమికి 184 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నందున అందరికీ మాట్లాడే అవకాశం రాకపోవచ్చు. కాదూకూడదని ముందస్తు జాగ్రత్తలు తీసుకొంటే ఏదో ఒక సందర్భంలో మాట్లాడే అవకాశం రావచ్చు. సమావేశాలకు ముందుగానే సమస్యలపై ప్రశ్నలు పంపవచ్చు. ఆయా అంశాలపై చర్చ జరిగేటప్పుడు జోక్యం చేసుకుని మాట్లాడవచ్చు. క్వశ్చన్ అవర్, జీరో అవర్‌లను కూడా అందిపుచ్చునే అవకాశాలు వస్తాయి. తద్వారా అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి జిల్లా, నియోజకవర్గ సమస్యలు తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది.

**అందరూ అందుబాటులో ఉంటారు**

అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాకపోయినా ముఖ్యమంత్రి, యావత్




మంత్రివర్గ సభ్యులు సీఎం పేషీ అధికారులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు అంతా ఈ సందర్భంగా అందుబాటులో ఉంటారు. వారిని సమావేశాల ప్రారంభానికి ముందు సమావేశాలు జరిగే సమయంలో అవకాశం చూసుకుని కలవొచ్చు.

ఏరోజుకారోజు అసెంబ్లీ ముగిశాక సీఎం, మంత్రులతోపాటు ఉన్నతాధికారులు వారి కార్యాలయాల్లో అందుబాటులు ఉంటారు. ఆ సమయాన్ని ఎమ్మెల్యేలు సద్వినియోగం చేసుకోవచ్చు. మంత్రి దృష్టికి ఒక సమస్య తీసుకెళ్తే అత్యవసరం అయితే అప్పటికప్పుడు సంబంధిత శాఖ ఉన్నతాధికారితో మాట్లాడే అవకాశం లభిస్తుంది. జిల్లాలో గెలుపొందిన ఎమ్మెల్యేలలో ఇద్దరు మంత్రులయ్యారు. మిగిలిన 8 మంది అధికార పార్టీ శాసనసభ్యుల్లో కందుకురు, చీరాల ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీకి వెళుతున్నారు. మిగిలిన వారంతా గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన అనుభవం ఉన్నవారే. విపక్ష ఎమ్మెల్యేలకు చెందిన వారిలో దర్శి ఎమ్మెల్యే రెండోసారి, వైపాలెం ఎమ్మెల్యే తొలిసారి అసెంబ్లీకి ఎన్నిక అయ్యారు. ప్రభుత్వం వారి విన్నపాలకు ప్రాధాన్యం ఇచ్చినా ఇవ్వకపోయినా తమ వంతుగా ప్రజా సమస్యలను అసెంబ్లీ లోపల బయటా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉంది.

**ప్రధాన హామీలపై ముందు దృష్టి పెట్టాలి**

జిల్లా అభివృద్ధికి సంబంధించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వెలిగొండ, గుండ్లకమ్మ, రామతీర్థం లాంటి తాగు, సాగునీటి ప్రాజెక్టులపై వారు హామీల వర్షం కురిపించారు. జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని లోకేష్ పదేపదే ప్రకటించారు. మరోవైపు మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ఒంగోలు జిల్లాలో కలుపుతామన్న హామీని తండ్రీకొడుకులు జిల్లాకు వచ్చినపుడల్లా ఇచ్చారు. వాటన్నింటిని వారికి గుర్తుచేయాల్సిన బాధ్యత జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలపై ఉంది.

ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకోవడం.. ఆ తరువాత ఇటు చంద్రబాబు, ఇటు లోకేష్‌తో భేటీ అయి వారిచ్చిన హామీల అమలును గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. వీటికి తోడు నియోజకవర్గాలలో వారిచ్చిన హామీలు, తక్షణ ప్రజావసరాలపై అసెంబ్లీ లోపలా, బయటా వాణి వినిపించాల్సిన అవసరం ఉంది.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

దర్శి, జూలై 21: మండలంలోని అబ్బాయిపాలెంకు చెందిన కొత్తపల్లి చినానాసరయ్య (43) విద్యుత్ షాక్‌తో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. చినానాసరయ్యకు రెండు ఎకరాల 70 సెంట్ల సాగుభూమి ఉంది. ఆ భూమిలో బోరు వేసుకు ని పైరు సాగు చేసకుంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం పొగనారు తెచ్చుకుని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యాడు. పొలంలో ఉన్న మోటార్ వేసేందుకు స్విచ్ వేయగా లూజ్ కనెక్షన్ ఉండటంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆకుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది, ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## విద్యుత్ పరికరాలు చోరీ

పామూరు, జూలై 21: తెల్లరాయి మినరల్స్ ఫ్యాక్టరీలో రూ.9 లక్షల విలువ గలిగిన విద్యుత్ పరికరాలు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటుచేసు కుంది. మండలంలోని ఇనిమెర్ల గ్రామ జాతీయ రహదారి ప్రక్కనున్న సిద్ద మూర్తి నారాయణరెడ్డికి చెందిన భైరవ మినరల్ ఫ్యాక్టరీలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని గల సుమారు రూ.3 లక్షల విలువ కలిగిన రాగి తీగ, ట్రాన్స్‌ఫార్మర్‌లోని రూ.2 లక్షల విలువ కలిగిన ఆయిల్, 6 కిలో మీటర్‌ల విద్యుత్ కండక్టర్ వైర్‌ను చోరీ చేశారు. ఈమేరకు నారాయణరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.



ప్రసన్నాంజనేయ స్వామి

## ప్రసన్నాంజనేయునికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, జూలై 21 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. ప్రాతఃకాలంలో సుప్రభాత, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

# మంచం పట్టిన అంబడిపూడి

- విష జ్వరాలు, గున్యాతో బాధపడుతున్న ప్రజలు
- గ్రామంలో ఇంటికి ఇద్దరు, ముగ్గురు రోగులు
- విషమించిన వారు పట్టణాలకు పరుగు
- పీహెచ్‌సీలో అందని వైద్య సేవలు



జ్వరాలతో మంచం పట్టిన ఖాసిం సాహెబ్.. శ్రీధర్.. గున్యాతో బాధపడుతున్న మస్తానమ్మ

బల్లికురవ, జూలై 21 : మండలంలోని అంబడిపూడి గ్రామంలో పది రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామస్థులు చికున్ గున్యాతో మంచం పట్టారు. ప్రతి ఇంటికీ ఇద్దరుముగ్గురు చొప్పున జ్వరాలు, నొప్పులతో బాధ పడుతున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్య కోసం పట్టణానికి తరలిస్తున్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా గ్రామంలో జ్వరాలు వ్యాప్తి చెందాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న పెద అంబడిపూడి గ్రామానికి విష జ్వరాలు, చికెన్ గున్యా వ్యాప్తి రోజు రోజుకూ పెరుగుతోంది. గత పది రోజుల కిందట పదుల సంఖ్యలో జ్వరబాధితులు ఉండగా నేడు వందల మందికి జ్వరాలు రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి జ్వరాలు తీవ్రంగా బాధ పెడుతుండడంతో వారు పట్టణ ప్రాంతాలలోని ప్రైవేట్ వైద్యశాలలకు చేరుతున్నారు. కొందరికి జ్వరం రాగానే కాళ్లు చేతులు, కీళ్లు పట్టుకొని మంచాల నుంచి కదలలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జ్వరాలు తగ్గినా నొప్పుల తగ్గడం లేదని బాధపడుతున్నారు. గ్రామంలోని ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకొంటున్నామని, గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా వైద్యులు సకాలంలో తమకు వైద్యం అందించలేకపోతున్నారని పలువురు రోగులు వాపోతున్నారు. ప్రైవేట్ వైద్యశాలలకు వెళితే లక్షలు ఖర్చు అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంత డబ్బులు పెట్టే స్థోమత లేక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నామని చెప్పారు. గున్యా గ్రామంలో ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ వారు పారిశుధ్య పనులు కొంత వరకు చేపట్టినా జ్వరాలు అదుపులోకి రాలేదని వర్షాలు కురుస్తుండడంతో రోజు రోజుకూ జ్వర పీడితులు పెరుగుతన్నారని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే విష జ్వరాలను అదుపులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు

### పట్టించుకోని వైద్యారోగ్య శాఖ

అంబడిపూడి గ్రామానికి కిలో మీటర్ దూరంలో గుంటుపల్లి పీహెచ్‌సీ ఉంది. అక్కడ వైద్యలు సిబ్బంది ఉండి కూడా విష జ్వరాలు, గున్యా వ్యాప్తి చెంది ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరికి విష జ్వరాల నుంచి డెంగ్యూగా మారి రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గి పోతున్నాయని, జ్వరాలు తగ్గే వరకు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్త నమునాలను సేకరించాలని వారు కోరుతున్నారు. నిరుపేదలు ప్రైవేట్ వైద్యాలలకు వెళ్లలేక ఇళ్లలోనే మంచాలలో ఉండి బాధపడుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి ప్రత్యే వైద్య బృందాన్ని రప్పించి పరీక్షలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




శింగరకొండ సమీపంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ అద్దంకి బోర్డు

## అటకెక్కిన ఐ లవ్ అద్దంకి

- నిర్వహణలో వైసీపీ నిర్లక్ష్యం
- నిరుపయోగంగా మారిన వైనం

అద్దంకి, జూలై 21 : వైసీపీ పాలనలో అన్ని మున్సిపాలిటీలలో ఆర్భాటపు హంగుల కోసం లక్షల రూపాయలు ఖర్చుచేశారు. వాటి నిర్వహణపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగమయ్యాయి. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో శింగరకొండ సమీపంలోని 99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద 2022లో సుమారు రూ.5లక్షలతో ఐ లవ్ అద్దంకి బోర్డు ఏర్పాటు చేసి చుట్టూ గ్రీనరీ అభివృద్ధి చేశారు. అదే సమయంలో నామ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వేసే సమయంలో అదే కాంట్రాక్టర్ చేత ఐ మాస్ లైట్ కూడా ఏర్పాటు చేయించారు. అటు గ్రీనరీ, ఐ మాస్ లైటింగ్ నిర్వహణ లేక పోవడం ప్రస్తుతం వెక్కిరించి దర్శనమిస్తున్నాయి. కనీసం లైటింగ్ నిర్వహణ అయినా ఉంటే పరిసర ప్రాంతాలకు, వాహనచోదకులకు ఉపయోగకరంగా ఉండేది. ఆర్భాటంగా ఏర్పాటు చేసినా కొద్ది నెలలకే నిరుపయోగంగా మారినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

## వైసీపీ నేత భీమనాథం మృతి



పంగులూరు, జూలై 21: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సమీప బంధువు, కొండమూరు గ్రామానికి చెందిన వైసీపీ మండల నేత భీమనాథం అంజిరెడ్డి (62) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా షుగర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్న అంజిరెడ్డిని శుక్రవారం వైద్యం నిమిత్తం కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. కొండమూరులో అంజిరెడ్డి మృతదేహానికి నేతలు పాణెం హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డితో పాటు పలువురు నివాళి అర్పించారు. అంజిరెడ్డికి భార్య సీతాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు మృతి



పంగులూరు, జూలై 21 : పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ బాచిన వెంకటేశ్వర్లు (78) శనివారం రాత్రి మృతి చెందారు. బాచిన వెంకటేశ్వర్లు 2018 నుంచి 2024 మార్చి వరకు శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పనిచేశారు. ఆయన పదవీకాలంలో ఆలయ అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందారు. ఆదివారం వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య, బాచిన చెంచుప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లుకు భార్య సుబ్బరావమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## రేపు షెడ్యూల్ కులాల సంఘ సమావేశం

అద్దంకిటౌన్, జూలై 21: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం సాయంత్రం 3 గంటలకు అంబేడ్కర్ భవనం బాపట్లలో జరుగుతుందని సంఘ జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య పాల్గొంటారని షెడ్యూల్ కులాల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులంతా హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై చర్చ జరుగుతుందని తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తికి వైద్యం

### వివరాలు చెప్పకపోవడంతో తలలు పట్టుకున్న పోలీసులు



చికిత్స పొందుతున్న వ్యక్తి

చీరాలటౌన్, జూలై 21 : తీవ్ర రక్త గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలకు వచ్చిన వ్యక్తికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతడు స్పృహలోనే ఉన్నా వివరాలు చెప్పలేక పోతుండడంతో వైద్యులు, అవుట్ పోస్ట్ పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చీరాల ఏరియా వైద్యశాలకు 108లో తలకు వెనుక భాగంలో తీవ్రమైన రక్త గాయాలతో ఉన్న 35 సంవత్సరముల వ్యక్తి వచ్చారు. అతనికి వైద్య సేవలు చేసేందుకు వైద్యులు రాగా నిరాకరించారు. వెంటనే వెళ్లాలని వారిని ఇబ్బందులకు గురి చేశాడు. అయినా బలవంతంగా వైద్యం చేశారు. సమాచారం అందుకున్న అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకునేందుకు ఆరా తీయగా, తన పేరు గోఫర్ అని తన బాబాయి సిద్ధు, మరొకరు కర్రతో దాడిచేశారని, తాను చెరువుల వద్ద కాపలా ఉంటానని చెప్పాడు. మరొకసారి తాడేపల్లి అని కొట్టి ఇక్కడ హాస్పిటల్‌కు దూరంలో పడేశారని చెప్పాడు. దీంతో ఇతని వివరాలు బంధువులకు తెలిపేందుకు వైద్యులు, పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ బలమైన దెబ్బలు కావడంతో మతిస్థిమితం కోల్పోయి ఉంటాడేమోనని భావిస్తున్నారు.

## సేవా కార్యక్రమాలు హర్షణీయం : ఆమంచి

చీరాల, జూలై 21 : ఆధ్యాత్మిక భావంతో పాటు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. బెస్తపాలెంలోని సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమంచి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వాహకులు సమకూర్చిన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

మార్టూరు, జూలై 21 : కోణిదెన రోడ్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న నాగండ్ల రవికుమార్‌ను ఆదివారం అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. రవికుమార్ ఒక గదిలో మద్యం బాటిళ్లు స్టాక్ పెట్టుకొని అమ్ముతున్నారన్నారు. అదుపులోకి తీసుకొని, 147 మద్యం క్వార్టరు బాటిళ్లు, 7 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతనిని స్టేషన్‌కు తరలించామన్నారు.

## పమిడిపాడు వంతెనతో ప్రమాదం

పంగులూరు, జూలై 21 : పమిడిపాడు మేజర్‌పై రక్షణ గోడలు లేని వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. ముప్పవరం నుంచి బొమ్మనంపాడు వైపుగా అద్దంకి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో పమిడిపాడు మేజర్‌పై నిర్మితమై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేక పోవడంతో ప్రజలు రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నారు. పంట పొలాలకు వ్యవసాయం కోసం ట్రాక్టర్లతో రైతలు, బట్టీల నుంచి ఇటుక చేరవేసే వాహనాలతో పాటు వివిధ పనులపై పలు రకాల వాహనాలపై అద్దంకికి రాకపోకలు సాగించే ప్రయాణికులతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రహదారిలో రక్షణ గోడలు లేని వంతెనపై ప్రయాణం సాగించే పలు వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. ప్రమాద బారిన పడిన వాహనచోదకులు తీవ్రంగా గాయపడడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. దీర్ఘ కాలంగా పమిడిపాడు మేజర్‌పై రక్షణ గోడలు లేని వంతెనపై ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాలలో భారీ వాహనాలు ఎదురుగా వచ్చిన సందర్భంలో లైట్ల వెలుతురులో మార్జిన్ గుర్తించ లేక ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి సంబంధిత అధికారులు ఏబీసీ పరిధిలో పమిడిపాడు మేజర్‌పై ముప్పవరం వద్ద వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు నివారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పమిడిపాడు మేజర్‌పై ముప్పవరం వద్ద రక్షణ గోడ లేని వంతెన



నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ రాంప్రసాద్

## రోటరీ క్లబ్‌లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

పంగులూరు, జూలై 21 : రోటరీ క్లబ్‌లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, మహిళల ప్రాతినిధ్యం పెరిగిన క్లబ్‌లు సమర్థవంతంగా పనిచేయగలుగుతాయని డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ అన్నారు. ఆదివారం పంగులూరులో జరిగిన రోటరీ క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో రాంప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్లబ్‌లు బాగా పనిచేస్తున్నాయని, చిన్న క్లబ్‌లైనప్పటికీ గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగునంగా సేవలందిస్తున్నాయన్నారు. పంగులూరు క్లబ్ ఏర్పడి 18 ఏళ్ల గడుస్తున్నా మహిళల ప్రాతినిధ్యం లేదని, మహిళా సభ్యుల సంఖ్య వచ్చే ఏడాదికి కనీసం 9కి పెంచాలన్నారు. యువత సేవాభావంతో సభ్యత్వం స్వీకరించేందుకు ముందుకు రావాలన్నారు. నిస్వార్థంగా పనిచేసే సభ్యులున్నందునే క్లబ్ అనతి కాలంలోనే అభివృద్ధి వైపు అడుగులు వేసిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య అన్నారు.

### నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు నూతన అధ్యక్షుడిగా షేక్ కాలేషావలి, కార్యదర్శిగా విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, కోశాధికారిగా జాగర్లమూడి సుబ్బారావుతో డిస్ట్రిక్ గవర్నర్ రాంప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి వీరరాఘవయ్య, బాచిన చెంచుప్రసాద్, గవర్నర్ అపాయింట్‌మెంట్స్ చైర్మన్ కొల్లా సింగారావు, తేళ్ల రమేష్‌చంద్ర, కరణం హనుమంతరావు, విశ్రాంత సైంటిస్ట్ రాయిణి రామారావు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక ఎస్.బి.ఐ.లో ఖాతాదారులకు సేవలందిస్తున్న పేర్ని వీరనారాయణను క్లబ్ బాధ్యులు ఘనంగా సత్కరించారు.

## అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న నారాయణరావు

చినగంజాం, జూలై 21 : అవినీతి నిర్మూలన జరిగినప్పుడే భారతదేశం అభివృద్ధి చెందుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, లాయిడ్ ఫార్మా ఎండీ విక్రం నారాయణరావు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో ధనిక్ భారత్ అనే అంశంపై ఆదివారం రాత్రి జరిగిన చర్చా వేదికలో ఆయన మాట్లాడారు. పలువురు ప్రముఖులు, ఔత్సాహికులు, గ్రామస్థులు, దళిత నాయకుల సమక్షంలో దళితులకు అప్పుడప్పుడూ వచ్చే అలంకార ప్రాయమైన రాజ్యాధికారమా లేక నిర్ణయాధికారంతో కూడిన రాజ్యాధికారమా అనే అంశంపై చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించారు. చర్చావేదికలో నారాయణరావు మాట్లాడుతూ 40శాతం కులాల వారు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైనా ఎస్సీ వర్గీయుల దగ్గర నిర్ణయాధికార విలువ ఉండడం లేదన్నారు. వీరికి రాజ్యాధికారం వస్తుంది కాని నిర్ణయాధికారం ఉండడం లేదన్నారు. ఎస్సీ కాలనీలు కూడా అభివృద్ధి వైపు అడుగులు వేయడంలేదని అన్నారు. దళితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వారికే సర్పంచ్‌లగా పదవులు ఇవ్వాలన్నారు. ప్రధాన అంశాలైన దళితుల కాలనీలను ప్రత్యేకపంచాయతీలుగా ఏర్పాటు చేయడం, ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ ఏర్పాటు, దళితలకు అంబేడ్కర్ చేసిన కృషి వారి అభివృద్ధిలో యువకుల పాత్ర వంటి అంశాలపై పలువురు వక్తలు, ఔత్సాహకులు మాట్లాడారు. అవినీతిని ప్రోత్సహించే వారిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని చర్చా వేదికలో తీర్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, ప్రముఖులు, విద్యావంతులు, దళిత నాయకులు, ఔత్సాహికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 60 మగ్గాలు సరఫరా చేయాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, జూలై 21 : వచ్చే నెల 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం రోజున జిల్లాలో సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్)లకు 60 ఫ్రేమ్ మగ్గాలు సరఫరా చేయాలని హ్యాండ్లూమ్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ సాహు సిరిసిల్లలోని సప్తగిరి ఉడెన్ ఫ్రేమ్ వర్క్స్ వారికి లేఖ రాశారు. చీరాల నియోజకవర్గంలోని బీఎల్ఎస్ (బ్లాక్ లెవల్ క్లస్టర్లు)లు ఉన్నా .... లేనట్లే అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. దీనిపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వీడని వర్షం ... ఆగిన మగ్గం అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై కూడా అధికారులు స్పందించారు. ఈ క్రమంలో ఎక్కడైనా మగ్గాలు, నూలు దెబ్బతింటే వాటి వివరాలను యుద్ధప్రాతిపదికన నమోదు చేయాలని జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి జే రాజవర్ధనరావు సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. అలానే నేతన్నల వద్ద నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను కూడా కొనుగోలు చేసే విషయమై చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈమేరకు నివేదికను తయారు చేయాలని సిబ్బందికి సూచించారు.



# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణిమ



ఈపురుపాలెం అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య.. పంగులూరులోని సాయిబాబా

చీరాల, జూలై 21 : నియోజకవర్గంలోని షిరిడీ సాయిబాబా మందిరాల్లో ఆదివారం గురుపౌర్ణమిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాలను శోభామానంగా తీర్చిదిద్దారు. ప్రాతఃకాలం నుంచి ప్రత్యేక పూజ లు కొనసాగాయి. బెస్తపాలెం, బోస్‌నగర్‌లలోని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. ఈపురుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని మందిరంలో పూజా కార్యక్రమాలకు కొండయ్య హాజరయ్యారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. చీరాల మండలం జాండ్రపేట, వేటపలెం మండలం అక్కాయిపాలెంలలోని బాబా ఆలయాల్లు జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే చిన్నకుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు. కొంత తుంపర జల్లులు ఉన్నప్పటికి అన్న ప్రసాద వితరణ ప్రారంభించే సమయానికి వర్షం ఆగింది. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు బాబాను దర్శించుకుని అన్న ప్రసాదం పొందారు.

### కత్తి దూసిన కొండయ్య

గొల్లపాలెంలోని గంగమ్మ తల్లి గుడి, కృష్ణుడి గుడి, శివాలయంలలో ఎమ్మెల్యే కొండయ్య స్థానికుల ఆహ్వానం మేరకు వారితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభిమానులు కొండయ్యకు ప్రత్యేక అలంకరణతో ఉన్న కరవాలాన్ని అందించారు. వారి కోరిక మేరకు కొండయ్య కరవాలాన్ని ఒర నుంచి దూసి అభివాదం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్రనాథ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా రథోత్సవం

అద్దంకి : గురుపౌర్ణమిని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాలలో స్వామివార్లను, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆయా దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని చక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. దత్తపాదుకాక్షేత్రంలో తైలాభిషేకాలు, గురుపాదుకా పూజ, పారాయణం, హోమం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని సాయిబాబా, శింగరకొండలోని బాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని నక్కబొక్కలపాడు హనుమాన్ సాయి అనుగ్రహ మందిరం, ఉప్పుమాగులూరు సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హారతి, అభిషేకాలు జరిగాయి. సాయినామ సంకీర్తనలు చేశారు. దేవాలయ సేవకులు దాసరి ప్రసాద్, కక్కెర సుబ్బారావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

చినగంజాం : హనుమ సాయి కుటీరంలోని షిరిడీ సాయి మందిరంలో, మున్నంవారిపాలెం రైల్వేగేటు సెంటర్‌లోని బాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, కాకడ హారతి అనంతరం బాబా వారి మూలవిరాట్‌కు అభిషేకాలు జరిపారు. నూతన వస్త్రాలు, ఆభరణాలు, పలు రకాల పూలమాలలతో బాబాను ప్రత్యేకంగా అలంకరించి, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

మార్టూరు : వలపర్ల, ద్రోణాదుల, మార్టూరు, బొబ్బేపల్లి తదితర గ్రామాలలో బాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మార్టూరులో పడమర బజారున వాటర్ ప్లాంట్ వద్ద బాబా మందిరంలో అన్నదానం చేశారు.బొడ్డురాయి సెంటరు సమీపంలోని ఆలయంలో పూజలు, స్వామి వారిని గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం పూనూరు, గన్నవరం గ్రామాలలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూనూరులో హోమాలు అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. గన్నవరంలో బాబాకు ప్రధాన ట్రస్టీ ప్రత్తిపాటి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రధాన పూజారి వేదాంతం హనుమత్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మహిళా భక్త సమాజం వారు భగవద్గీత పారాయణం చేశారు.

ఇంకొల్లు : గ్రామాలలో గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంగులూరు : గురు పౌర్ణమి వేడుకను భక్తులు ఘనంగా నిర్వహించారు. ముప్పవరంలోని శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. కాకడ హారతి అనంతరం సంస్థాన్ బాబా మూలవిరాట్‌కి పంచామృతాభిషేకం నిర్వహించి చతుర్వేద పారాయణము గావించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.



అద్దంకిలో నిర్వహిస్తున్న రథోత్సవం.. చినగంజాంలో బాబాకు మొక్కుతున్న భక్తులు..మార్టూరులో పల్లకిలో ఊరేగుతున్న సాయి

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- 15 ఏళ్లుగా ఏలూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం
- ఒంగోలు డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ శివకుమార్



ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు, టీడీపీ నాయకులు

చినగంజాం, జూలై 21 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా అగ్రిగ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య, అబ్దుల్‌కలాం ఆజాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఒంగోలు డిప్యూటీ మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ శివకుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త, లాయిడ్ ఫార్మా ఎమ్‌డీ విక్రం నారాయణరావు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాజకీయాలకతీతంగా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. రాజకీయం కంటే ప్రజాసేవే తనకు ఇష్టమని ఎమ్మెల్యే ఏలూరి పదేపదే చెప్తారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించే లక్ష్యంగా ఎమ్మెల్యే చూపుతున్న ఔదార్యం మరువలేనిదని నారాయణరావు అన్నారు. నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో లక్ష మంది నిరుపేదలకు కంటి వెలుగు ఇవ్వాలనే తలంపుతో మెగా కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. వేలాది మందికి కంటి చూపు కల్పించిన ఘనత ఏలూరికి దక్కుతుందన్నారు. ఆయన చేస్తున్న ప్రజాసేవకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ తమవంతు కర్తవ్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. రమేష్ హాస్పిటల్ కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని సంకల్పంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. గ్రామాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని రమేష్ హాస్పిటల్ 20ఏళ్లకు పైగా కొనసాగిస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పోతినేని రమేష్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాయపాటి మమత, డాక్టర్ ఎలవర్తి కార్తీక్ ప్రత్యేకంగా పరివేక్షించారు. ప్రతి నిత్యం క్యాంపులో ఏర్పాట్లు, పరీక్షలు, మందులు పంపిణీ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ క్యాంపు విజయవంతానికి కృషి చేశారు. తొలత ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు, వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించిన 1089 మందికి కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, పల్మానాలజీకి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ ఆంజనేయులురెడ్డి, డాక్టర్ కొండలరావు, డాక్టర్ వెంకట రవీందర్, డాక్టర్ భరత్ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. పలువురుకి పలు చికిత్సల నిమిత్తం రాయితీ వైద్యం అందించేందుకు ఆరోగ్య భాగ్యం కార్డులను అందజేశారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో 180 మంది వైద్య శిబిరంలో వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నెల్లూరు బాలాజీ నగర్ అద్దాల మందిరంలో ప్రత్యేక పూజలందుకున్న సాయినాథుడు

## వైభవంగా గురుపౌర్ణమి



అల్లూరులో సాయినాథుడికి నిర్వహించిన గ్రామోత్సవం

జిల్లాలోని వైష్ణవాలయాల్లోనూ, సాయిబాబా మందిరాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. పలుచోట్ల సామూహిక సత్యనారాయణ, సాయి వ్రతాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు.



నెల్లూరు గాంధీనగర్ సాయిబాబా ఆలయంలో జరిగిన గురుపూర్ణిమ పూజల్లో పాల్గొన్న భక్తులు

# మళ్లీ తెరపైకి గోకులాలు

- పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ
- గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70శాతం...
- పెంపకందారులకు రూ.60 వేల నుంచి 2.07 లక్షల వరకు లబ్ధి
- పాడి రైతులకు తీపికబురు



గత టీడీపీ హయాంలో కోలగట్లలో నిర్మించిన గోకులం షెడ్డు

సంగం, జూలై 21: పాడి రైతులకు, జీవాల పెంపకందారులకు రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీపై పశువుల, జీవాల షెడ్ల(గోకులాలు)ను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న పాడి రైతులకు 90శాతం, జీవాల రైతులకు 70 శాతం రాయితీతో ఈ షెడ్లను మంజూరు చేయనుంది. నిర్మించే షెడ్డును బట్టి ఒక్కొక్క రైతులకు రూ. 60 వేల నుంచి 2.07 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. 2014-19లో టీడీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం కింద అప్పట్లో పరిమిత సంఖ్యలో షెడ్లను మంజూరు చేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని మూలన పడేసింది. అప్పట్లో షెడ్డు నిర్మించుకున్న కొందరికి జగన్ ప్రభుత్వం బిల్లులు కూడా ఇవ్వలేదు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పశుసంవర్ధక శాఖపై ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

**● పశుసంరక్షణపై దృష్టి**

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పశుసంరక్షణపై దృష్టిసారించింది. తొలినెలలోనే పాడి రైతులకు ఉపకరించే పథకాలకు శ్రీకారం చుట్టింది. పశువులతోపాటు గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా ఇటీవల వెలువడ్డాయి. పశువుల షెడ్లను మూడు విభాగాలుగా విభజించారు. గరిష్ఠంగా ఆరు గేదెల కోసం నిర్మించే షెడ్లకు రూ. 2.3 లక్షలు మంజూరు చేయనున్నారు. అందులో పదిశాతం మాత్రమే లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం నిధులను ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ప్రభుత్వం సమకూర్చనుంది. జీవాలకు 70 శాతం రాయితీ రైతు వాటా 30 శాతం భరించాల్సి ఉంటుంది. నాలుగు గేదెలకు అయితే రూ. 1.85 లక్షలు, రెండు గేదెలకు అయితే రూ. 1.15 లక్షలుగా యూనిట్ విలువగా నిర్ణయించారు. అదే గొర్రెలు, మేకలకు సంబంధించి 20 గొర్రెలలకు రూ. 1.30 లక్షలు, 50 గొర్రెల కోసం రూ. 2.30 లక్షలు, పౌల్ట్రీ షెడ్లకు రూ. 87 వేల నుంచి 1.32 లక్షలుగా ఒక్కో యూనిట్‌ను నిర్ణయించారు.

**● పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎంపిక**

గోకులాలకు లబ్ధిదారుల ఎంపిక పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వీటి మంజూరు, నిర్మాణం ఇతరత్రా అంశాలను ఉపాధి హామీ సిబ్బందిని పర్యవేక్షించే డ్వామా పరిధిలో జరుగనున్నాయి.



దర్గా ప్రాంగణంలో భక్తుల కోలాహలం



బారా షహీద్‌లను దర్శించుకుంటున్న భక్తులు

## మది నిండా భక్తితో

# మళ్లీ కలుద్దాం...!

- ఇక సెలవు.. బై..బై..! ● ముగిసిన రొట్టెల పండుగ
- చివరిరోజు భారీగా భక్తుల రాక ● కల్యాణం, ఉద్యోగ రొట్టెలకు డిమాండ్
- సమష్టి కృషితో విజయవంతం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 21: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన రొట్టెల పండుగ ఆదివారం రాత్రి ముగిసింది. జిల్లా నలుమూలల నుంచేకాక సుదూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో తరలివచ్చిన యాత్రికులు తాము కోరుకున్న రొట్టెలను అందుకుని, భక్తితో బారాషహీద్‌లను దర్శించుకుని వెళ్లారు. కోరికలు తీరిన వారు రొట్టె వదిలి మొక్కు తీర్చుకున్నారు. పండుగలో పాల్గొన్న భక్తజనం ఆధ్యాత్మిక సుగంధంతోపాటు పర్యాటక ఆనందాలను ఆస్వాదించారు. మది నిండా భక్తిభావంతో మళ్లీ వస్తాం.. ఇక సెలవంటూ... వారివారి స్వగ్రామాలకు బయలుదేరారు. బారాషహీద్ దర్గా మైదానంలో పండుగ సందడిని, స్వర్ణాల చెరువు ఘాట్ అందాలను, బోట్‌క్లబ్‌లో బోట్ షికారు విశేషాలను తమ సెల్‌ఫోన్లలో తీపి గుర్తులుగా బంధించి తీసుకెళ్లారు. ఫుడ్ కోర్టుల్లో రకరకాల నెల్లూరు రుచులను లొట్టలేసుకుని తిన్నారు. ఐదురోజులుగా నగరపాలక సంస్థ, పోలీస్‌శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలు, రెడ్‌క్రాస్, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించారు.

● రొట్టెల పండుగకు చివరిరోజు భారీగా భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు, స్వర్ణాల చెరువు ఘాట్‌లో రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తరలివస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం రెండు గంటలపై నుంచి నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా ప్రాంతం భక్తసంద్రమైంది. వర్షం పడుతున్నా భక్తులు రొట్టెలు మార్చుకున్నారు.

● రొట్టెల పండుగకు తరలివచ్చిన భక్తులకు మూడు రోజులపాటు బెంగళూరు నుంచి వచ్చి[illegible] భక్తులు, సయ్యద్‌సమీ ఆధ్వర్యంలోనూ, స్వర్ణవేదిక కల్యాణ మండపం, అచ్చుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపాల అధినేతలు ఉచితంగా అన్నదానం చేశారు.

● అత్యధికంగా యువతీ,యువకులు కల్యాణం, ఉద్యోగం రొట్టెలను పట్టుకున్నారు. తమ కోర్కెలు తీర్చాలని 12 మంది అమరవీరులను మనసారా ఆరాధించారు. తిరుగుప్రయాణంలో జిల్లాలోని కసుమూరు దర్గా, ఏఎస్ పేట దర్గాలను దర్శించుకున్నారు.



దర్గాలో సమాధుల దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి సుజిత కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రొట్టెల పండుగలో పాల్గొన్నారు. బారాషహీద్‌లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకున్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేదికపై అజీజ్ తదితరులు

**వచ్చే ఏడాది ఇంకా ఘనంగా..**

రొట్టెల పండుగను వచ్చే ఏడాది ఇంకా ఘనంగా నిర్వహించుకుందామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి బోట్ క్లబ్‌లో జరిగిన రొట్టెల పండుగ ముగింపుసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందరి సహకారంతో రొట్టెల పండుగను విజయవంతం చేశామని, సుమారు 10లక్షల మందికిపైగా భక్తులకు తరలిరాగా, వారికి అన్నీ సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ పండుగ విజయవంతమంతా పారిశుధ్య కార్మికులదేనన్నారు. పండుగ విజయవంతానికి మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు వెన్నుదన్నుగా నిలిచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సోమ, మంగళవారాల్లో కూడా రొట్టెలు పట్టుకునేందుకు వచ్చే భక్తులకు ఇలాగే అధికారులు, సిబ్బంది సేవలు అందించాలని కోరారు. దర్గా అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.5కోట్లు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు సేవలు అందించిన వారికి శాఖల వారీగా మెమోంటోలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, ఏఎస్పీ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, సిటీ ప్లానర్ దేవీకుమారి, కార్పొరేషన్ అధికారులు, దర్గా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నిధులున్నా నిర్లక్ష్యం

- మనుబోలు మండలంలో ఆగిన చెరువుల అభివృద్ధి
- జైకా కింద రూ.7 కోట్లతో పనుల ప్రారంభం
- బిల్లులు వచ్చినా వర్కులు చేయని కాంట్రాక్టర్
- మూడుసార్లు నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం
- పూర్తిగా దెబ్బతిన్న కట్టలు, కల్వర్టులు, తూములు
- రాజకీయ గ్రహణంతో రైతులకు ఇక్కట్లు

నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెత మనుబోలు మండలం రైతులకు అచ్చుగుద్దినట్లుగా సరిపోతుంది. దెబ్బతిన్న చెరువులను రాష్ట్ర ప్రభుత్వం బాగు చేయలేని పరిస్థితుల్లో వాటి అభివృద్ధికి జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) ముందుకొచ్చింది. మండలంలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు రూ.7 కోట్లు మంజూరు చేసింది. కానీ ఈ పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆ గడువు ముగిసింది. అయినా ఒక్క చెరువు కూడా బాగుపడలేదు. ఇప్పటికే ఓ బిల్లును జైకా విడుదల చేసింది. నిధులు ఇచ్చేందుకు జైకా సిద్ధంగా ఉన్నా కాంట్రాక్టర్ మాత్రం పనులు కొనసాగించడం లేదు. సుమారుగా ఏడాదిపైగా పనులు నిలిపేశారు. మరో మూడు నెలల్లో వ్యవసాయ సీజన్ మొదలు కాబోతోంది. ఈ లోపు పనులు చేస్తేనే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఇరిగేషన్ అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా కాంట్రాక్టర్ స్పందించలేదు.

**● అత్యవసరంగా పనులు చేయాల్సి ఉన్నా..**

కండలేరు రిజర్వాయర్ పరిధిలోని మనుబోలు మండలం సిస్టమ్ చెరువుల కింద సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో మనుబోలు, కొలనకొదురు, లక్ష్మీనరసాపురం చెరువులు ప్రధానమైనవి. ఈ చెరువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టలు బలహీనపడ్డాయి. కలుజులు దెబ్బతిని నీటి విడుదల సక్రమంగా చేయలేని దుస్థితి నెలకొంది. ఈ చెరువుల నుంచి కాలువల తూములు కూడా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల కల్వర్టర్లు, బ్రిడ్జిలు కూడా కూలిపోయేలా ఉన్నాయి. ఈ చెరువులను అత్యవసరంగా బాగు చేయాలని గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించారు. జైకా నిధుల ద్వారా ఈ పనులు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. 2021లో మనుబోలు, కొలనకొదురు, లక్ష్మీనరసాపురం చెరువుల అభివృద్ధికి రూ.7 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జైకా సంస్థ అనుమతులిచ్చింది. ఆ వెంటనే ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థ ఈ చెరువుల పనులను దక్కించుకుంది. అప్పట్లో ఓ వైసీపీ నాయకుడు ఈ టెండర్‌ను వేసుకున్నట్లు ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత సదరు నాయకుడు ఆ వర్క్‌ను మనుబోలు మండలానికి చెందిన మరో నాయకుడికి అప్పగించారు. 2022లో పనులు మొదలు పెట్టి సుమారు రూ.కోటి విలువైన వర్కులు చేశారు. ఆ బిల్లు కూడా పెట్టారు. వెంటనే బిల్లు కూడా మంజూరైంది. అయితే అసలు కాంట్రాక్టు సంస్థ పేరు మీద వర్క్ వేసుకున్న వైసీపీ నాయకుడు తన వాటా తీసుకొని మిగిలిన భాగాన్ని పని చేసిన మనుబోలు మండలం నాయకుడికి ఇచ్చారని, ఆ లెక్క సరిపోకపోవడంతో విభేదాలు వచ్చి పనులు నిలిపేశారని స్థానిక రైతులు చెప్పుకుంటున్నారు.



దెబ్బతిన్న మనుబోలు చెరువు కలుజు

**నోటీసులు ఇచ్చాం**

మనుబోలు మండలంలో జైకా పనులకు సంబంధించి కొంతవరకు పనులు జరిగి ఉన్నాయి. ఒప్పందం ప్రకారం మిగిలిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నాం.. త్వరలోనే పనులు మొదలు పెట్టించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

**- ఎం అనిల్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, నెల్లూరు సబ్ డివిజన్**

**● ముగుస్తున్న ఒప్పందం**

దాదాపు ఏడాదికి పైగా చెరువుల అభివృద్ధి పనుల్లో పురోగతి లేదు. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో అగ్రిమెంట్ గడువు కూడా ముగుస్తుంది. కానీ ఇప్పటికీ ఐదో వంతు కూడా పని జరగక పోవడం గమనార్హం. వ్యవసాయ సీజన్ మొదలైతే పనులు చేయడం సాధ్యపడదు. ఈ లోపే వీలైనంత వరకు పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఈ మూడు చెరువులు చాలా ప్రమాదకరంగా మారుతున్నాయి. కొలనకొదు రు చెరువు కట్ట తెగిపోయే స్థితిలో ఉంది. ఇదే జరిగితే వందల ఎకరాలు నీట మునుగుతాయి. ఈ నేపథ్యంలో పనులు చేయా లంటూ ఇరిగేషన్ అధికారులను రైతాంగం వేడుకుంటూ వస్తోంది. ఇప్ప టికే ఇరిగేషన్ అధికారులు మూడు సార్లు కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు జారీ చేశారు. పనులు మొదలుపెట్టకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. అయినా ఇంకా పనులు మొదలు కాలేదు. ఈ విషయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోక్యం చేసుకొని పనులు మొదలు పెట్టించాలని రైతులు కోరుతున్నారు.



పొదలకూరులో అక్రమంగా వేసిన ఓ లేఅవుట్

# 200పైగా అక్రమ లేఅవుట్లు


- గుర్తించి కమిటీకి అందజేసిన అధికారులు
- తదుపరి చర్యలపై ఉత్కంఠ

నెల్లూరు (జడ్పీ), జూలై 21 : జిల్లాలో అక్రమ లేఅవుట్ల గుర్తింపు కోసం అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు బృందాలుగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. లేఅవుట్లకు అనుమతులు తీసుకోకపోగా గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించి, లేఅవుట్లు ఏర్పాటు చేయడం, కొన్ని లేఅవుట్లకు కనీసం కన్వర్షన్ లేకుండా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ చేశారు. ఆ కమిటీ సూచనల మేరకు తొలివిడతగా కడప, నెల్లూరు జిల్లాల్లో అధికార యంత్రాంగం తనిఖీలు ప్రారంభించింది. నెల్లూరు జిల్లాలో 200లకుపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు పంచాయతీలతోపాటు కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్ల జాబితాను సిద్ధం చేసి కమిటీకి అందజేసినట్లు తెలిసింది. పంచాయతీల పరిధిలో 140, నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు ఆత్మకూరు, కావలి మున్సిపాలిటీల పరిధిలో 60లకుపైగా అక్రమ లే అవుట్లు ఉన్నట్లు తేలింది. విజయవాడ నుంచి జిల్లాకు చేరుకున్న కమిటీ సభ్యులు అక్రమ లేఅవుట్ల ఏర్పాటు ఎలా జరిగింది? చర్యలు ఎందుకు తీసుకోలేదు? తదితర అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతల అండదండలతో జిల్లాలో ఎక్కువగా ప్రభుత్వ భూములను ఆక్రమించి, లేఅవుట్లు వేసినట్లు తేలింది. దీంతో వాటిపై కమిటీ ప్రత్యేక పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులపైన ఏమాత్రం చర్యలు చేపడతారో వేచిచూడాలి.

# శ్రీసాయి.. జయజయ సాయి !



ఆత్మకూరు: సాయి భజనలో పాల్గొన్న భక్తులు



ఆత్మకూరు: షిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- సాయినాథుడికి ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు, హోమాలు
- భక్తులకు అన్న సంతర్పణ

**ఆత్మకూరు, జూలై 21:** నియోజకవర్గంలోని అన్ని సాయిబాబా మందిరాల్లో గురుపూర్ణిమ ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం ప్రాంగణంలోని షిర్డీ సాయి మందిరం, మండలంలోని మహిమలూరు, అప్పారావుపాళెం, బట్టేపాడు గ్రామాల్లోని సాయిబాబా మందిరాలలో భక్తులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కాగడహారతి, అభిషేకం, సామూహిక విష్ణుసహస్రనామ పారాయ ణంతో పులకించారు. అనంతరం విశేష అలంకరణ, విశేష అర్చన, అభిషేకం కార్యక్రమాలతో పాటు భజన సత్సంగంలో పాల్గొన్నారు. మందిర కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో, మహిమలూరులో ఉభయదాతలు యర్రంరెడ్డి నాగ మోహన్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

**ఉదయగిరి:** పట్టణ శివారు ప్రాంతం బీసీకాలనీ సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, శాంతిహోమాలు చేపట్టారు. అనంతనం సాయిబాబా పల్లకీసేవ, గానకచేరి నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**వింజమూరు:** స్థానిక సాయిబాబా మందిరంలో వేడుకలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

**సంగం:** స్థానిక ఆలయంలోని షిరిడి సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో ఉచిత సామూహిక సాయి సత్యవ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకీసేవ చేపట్టారు. వెంగారెడ్డిపాళెం ఆలయంలో నిర్మాణ దాతలు ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకాలు, కాగడ హారతి, హోమం, సాయికీర్తనలు, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

**వరికుంటపాడు:** స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి హారతులు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన పల్లకీసేవలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

**సీతారామపురం:** స్థానిక పంచాయతీలోని బాలత్రిపుర సుందరి ఆశ్రమంలో ఆశ్రమ ధర్మకర్త నన్నయబట్టు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భక్తులు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచే పంచామృత అభిషేకాలు, శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారికి మహిళలతో కుంకుమ పూజ చేపట్టారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

**చేజర్ల:** కోటితీర్థం గ్రామంలోని సాయి మందిరంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం గురజాల శ్రీని వాస్, శ్రావ్య, రియాన్షిక ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.



సంగం: సామూహిక సాయి సత్యవ్రతంలో పాల్గొన్న మహిళలు



ఉదయగిరి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## ప్రశాంతత పెరిగేకొద్దీ విజయాలు, శక్తిసామర్థ్యాలు



ఆత్మకూరులో శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యాన సాధకులు, పిరమిడ్ మాస్టర్లు


**ఆత్మకూరు, జూలై 21:** మనిషిలో ప్రశాంతత పెరిగేకొద్దీ అతని విజయాలు, శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని సీనియర్ పిరమిడ్ మాసర్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, శివకు మార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో గురు పౌర్ణమి సందర్భంగా ధ్యాన- జ్ఞాన శిక్షణా తరగతులు, సజ్జన సాంగత్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యానం, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం ప్రాముఖ్యతను వివరించారు. మనశ్శాంతి పొందాలంటే మనసును సాత్వికగుణంలో ఉంచుకోవాలని, అందుకు ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. ధ్యాన సాధకులు సజ్జనసాంగత్యంతో పాటు ఆత్మవిజ్ఞాన పుస్తకాలు చదవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం మేలన్నారు. మితిమీరిన వ్యామోహం, మమకారం మనశ్శాంతి లేకుండా చేస్తాయన్నారు. ఎప్పటికప్పుడు పాత ఆలోచలను, నమ్మకాలను విడిచిపెట్టినపుడే మార్పు సాధ్యపడుతుందన్నారు. చివరిగా ధ్యానసాధకులు, పిరమిడ్ మాస్టర్లతో కలిసి పట్టణ వీధుల్లో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. మాస్టర్లు చంద్రా విజయ, ఎం.వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

## చెన్నకేశవుడికి వైభవంగా గరుడసేవ

**సంగం, జూలై 21:** మర్రిపాడు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి శనివారం అర్ధరాత్రి గరుడవాహనసేవలో భక్తులకు దర్శన మిచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.



గరుడవాహనంపై చెన్నకేశవస్వామి



గంగమ్మతల్లి

### శాకాంబరి అలంకరణ

ఆషాఢమాసం గురుపౌర్ణమి సందర్భంగా పెన్నానది సమీపంలో వెలసిన గంగమ్మదేవి శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ధనింకుల సుధాకర్, సుష్మిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

**ఉదయగిరి, జూలై 21:** ఉదయగిరి దుర్గంపై అక్రమ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోతున్నా రు. దుర్గంపై పలువురు ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా బాటిల్‌పై రూ.50లు అధికంగా ఆటోలో తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. మద్యం విక్రయాలతో నివాసాల్లో నిత్యం వివాదాలు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

**వింజమూరు:** మండలంలో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు వెలిశాయి. కూల్‌డ్రింక్ షాపులు దగ్గర బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఆర్టీసీ రోడ్డు సమీపంలోని కూల్‌డ్రింక్ షాపుల్లో ఉదయం 5గంటల నుంచి ప్రభుత్వ షాపు తెరిచే వరకు మద్యాన్ని అధిక రేట్లుకు అమ్ముతూ ఆదాయాన్ని పొందుతున్నారు. పల్లెల్లో ఈ బెల్టుషాపులతో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

**వింజమూరు, జూలై 21:** స్థానిక సుజాతనగర్ కాలనీకి చెందిన సయ్యద్ ఇలియాజ్ జీవనాధారం కోసం అద్దాల పనికి వెళ్లి ప్రమాదవశాత్తు మెడకు తీవ్ర గాయాలై చెన్నై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గడ్డం పకీరయ్య, అతని మిత్ర బృందం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు.

## రేవూరులో ఉచిత వైద్యశిబిరం



మహిళను పరీక్షిస్తున్న వైద్యులు

**అనంతసాగరం, జూలై 21:** రేవూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం నెల్లూరు ఎనెల్ ఆసుపత్రి నిర్వాహకులు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్రప్రసాద్, లావణ్య, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## సోమశిలలో ప్రమాదకర సెల్ఫీలు



జలాశయ దిగువ ప్రాంతంలో యువకులు

**అనంతసాగరం, జూలై 21:** సోమశిల జలాశయ ప్రమాదకర ప్రాంతాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో యువత సంచరిస్తున్నారు. డ్యాం దిగువ ప్రాంతం నీటి ప్రవాహం కొనసాగే చోట సెల్ఫీలు తీసు కునేందుకు కొందరు ఉత్సాహం చూపుతున్నారు. ఆ ప్రాం తం పాచి పట్టి జారుతోంది. అక్కడకు చేరుకొని యువకులు కేరింతలు కొడుతూ సెల్ఫీలు, రీల్స్ తీస్తున్నారు. ఏమాత్రం ఆదమరిస్తే సుడిగుండంలో పడిపోయే ప్రమాదం ఉంది.

## పొలాలకు పచ్చి ఎరువులు



పశువుల పేడను ట్రాక్టర్లలో పొలాలకు తరలిస్తున్న దృశ్యం

**ఉదయగిరి, జూలై 21:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పంటల సాగునకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. అందులో భాగంగా పొలాలను దుక్కులు చేసి సహజసిద్ధమైన పశువుల ఎరువును ట్రాక్టర్లతో పంట పొలాల్లోకి తరలిస్తున్నారు. గన్నేపల్లి, బిజ్జంపల్లి, కొండాయపాళెం, తిరుమలాపురం, అప్ప సముద్రం గ్రామాల్లో వరినాట్లు చేసేందుకు సిద్ధమయ్యారు.

# కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర

- అంజనీపుత్రుడి నామస్మరణతో మార్మోగిన పురవీధులు
- రెపరెపలాడిన కాషాయ జెండాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**ఆత్మకూరు, జూలై 21:** పట్టణంలో ఆదివారం చేపట్టిన హనుమాన్‌శోభా యాత్ర భక్తుల మధ్య కనుల పండువగా జరిగింది. పట్టణంతో పాటు పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని జై హనుమాన్ నామస్మరణ చేయడంతో వీధులన్నీ మార్మోగాయి. పురవీధుల్లో కాషాయ జెండాలు రెప రెపలాడాయి. ఈ యాత్రలో పురప్రముఖులు, పలు పార్టీల నేతలు, యువతతో పాటు చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. రవితేజ కళ్యాణ మండపం, పాత సినిమాహాలు మీదుగా వైశ్యబజార్, సత్రంసెంటర్, చావిడి సెంటర్, హిల్‌రోడ్, ఎరుకల సాని నగర్, సోమశిలరోడ్డు సెంటర్, ఎల్ఆర్‌పల్లి, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ డిపో వ రకు కొన సాగింది. అక్కడి నుంచి తిరిగి మెయిన్‌బజార్ మీదుగా మున్సిపల్ బస్టాండ్, అరుంధతీయ కాలనీ మీదుగా రవితేజ కల్యాణ మండపం వద్దకు చేరుకుంది. తొలుత అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ, హనుమంతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి యాత్రను ప్రారంభించారు. భక్తులు మోటారు బైక్‌లపై శోభా యాత్రలో పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి అన్నద వితరణ చేపట్టారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు
- కావలి శ్రీసాయి క్షేత్రంలో వస్త్రదానం, సాయినామ సంకీర్తన, భజనలు

# సాయి శరణం.. బాబా శరణం..



కావలి: శ్రీసాయి క్షేత్రంలో సేవలందుకుంటున్న సాయినాథుడు



కొండాపురం: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

**కావలి టౌన్, జూలై 21:** గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం పట్టణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముసునూరు మందాటి చెరువు వద్ద నున్న శ్రీసాయి క్షేత్రంలో శ్రీసాయి సర్వీస్ సొసైటీ సభ్యులు ఉదయం కాగడ హారతితో పూజలు ప్రారంభించారు. అనంతరం 108కలశాలతో మూలవిరాట్టుకు అభిషేకాలు చేశారు. అనంతరం వర సిద్ధి గణపతి, సుబ్రమణ్యేశ్వర, ఆంజనేయస్వాములకు చందనాలంకారములు గావించారు. ఆలయ ప్రాంగణంలో బిట్రగుంట విజయగణపతి భజన సం ఘం సభ్యులు సాయినామ సంకీర్తన, భజనలతో అలరించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున భక్తజనానికి అన్నసంతర్పణ, పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు ధన్యవాదా లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో వెనుకనున్న నంద దీప్ సాయిసమాజ్ ఆలయంలో వేడుకలు పెద్దఎత్తున జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ గావించారు. పాతూరు బాబా మందిరంలో వెంగళరావునగర్ మందిరంలో, వెం గాయగారిపాలెం రోడ్డు మందిరంలో వేడుకలు జరిగాయి.



కలిగిరిలోని సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు

**కొండాపురం:** కొమ్మి గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద భక్తు లు విశేష పూజలు చేశారు. అలాగే లింగసముద్రం మండలం పెద్దపవని సాయిబాబా ఆలయం వద్దకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**జలదంకి:** స్థానిక బ్రాహ్మణక్రాక సాయి మందిరంలో భక్తులు పూజలు నిర్వహించారు. జరిగాయి. మండలంలోని పలు ఆలయాల్లో జరిగిన ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

**కలిగిరి:** స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో వేద పండితులు పున్నవజ్ఝల శేషసాయి ఆధ్వర్యంలో ఆలయంలో పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి నామస్మరణతో భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం విశేషపు ష్పాలంకరణతో స్వామికి గ్రామోత్సవం, చిన్నారులతో కోలాటం, భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

**బిట్రగుంట:** బోగోలు, విశ్వనాథరావుపేట, రైల్వే కాలనీ, పాతబిట్రగుంట, ద్వారకా నగరులోని సాయి మందిరాల్లో తెల్లవారు జామునుంచి బాబాకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రవాసభారతీయులు బచ్చు కృష్ణకుమార్ సంధ్య దంపతులు పాల్గొన్నారు. పల్లకీ సేవ, రాత్రి షిరిడి సాయినాథున్ని గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

**కావలి రూరల్:** మండలంలోని గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయాల ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

**అల్లూరు:** అల్లూరు పేటలోని సాయినాథుని ఆలయం, శివాలయంలోని దత్తసాయి మం దిరం కలుగోళమ్మ వీధి, తూర్పు వీధిలోని సాయినాథుని ఆలయాల్లో ప్రభాత దర్శనం, కాకడ హారతి, పాలాభిషేకం, పూలంగిసేవ, లక్ష మల్లెల పూజ, హారతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు. కలుగోళమ్మ వీధిలో సాయినాథుడిని అలంకరించి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.



కావలి: సాయినాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

**లింగసముద్రం, జూలై 21:** మండలంలోని పలు గ్రామాలలోని షిరీడీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని చినపవని, పెద పవని, మొగిలిచెర్లలోని దత్తా త్రేయస్వామి ఆలయం, లింగ సముద్రం, వీఆర్‌కోట తదితర గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. పెదపవనిలోని సాయిబాబా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



## జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు
- మంత్రి లోకేష్ హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

**కావలి టౌన్, జూలై 21:** ప్రభుత్వ విద్యారంగాన్ని బతికించుకుందామని ఆ బాధ్యత ఉపాధ్యాయులు ప్రభుత్వంపై వుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక ఎంజీఆర్ కల్యాణమండపంలో సంఘం జిల్లా మధ్యంతర సమావేశం జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు అధ్యతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో 4లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరకుండా ప్రైవేట్ పాఠశాలలో చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని ప్రభుత్వ విద్యకు పునాది అయిన ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎస్‌సీఈఆర్‌టీని మరుగుపర్చి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రవేశపెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్లస్-2 పాఠశాలలకు పర్మినెంట్ అధ్యాపకులను నియమించాలని, 2003డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు చలపతిశర్మ, శ్రీదేవి, కిలారి వెంకటేశ్వర్లు, అచ్చన్న, మురళీధరరావు, మాధవ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న డిజిటల్ అసిస్టెంట్ శ్యాంసుధాకర్

**బిట్రగుంట, జూలై 21:** పర్యావరణాన్ని కాపాడం ప్రతిఒక్కరి బాధ్యత అని కోవూరుపల్లి డిజిటల్ అసిస్టెంట్ మర్రి శ్యాంసుధాకర్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆయన క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీతో పాటు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజ్, గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్.యాదవ్ మాట్లాడారు. వాకర్స్ అసోసియేషన్ స్నేహభావాలకు ప్రతీక అన్నారు. ఆగస్టు 4న నిర్వహించనున్న 3కే రన్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, అసోసియేషన్ కమిటీ సభ్యులు ఉన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇంటూరికి ఘన సన్మానం

**కందుకూరు, జూలై 21:** కందుకూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ముందుగా పొట్టిశ్రీరాములు విగ్రహం నుంచి వాసవి గ్రంథాలయం వరకు నాగేశ్వరరావును ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం వాసవి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడటంతోపాటు ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా తమ వ్యాపారాలు చేసుకునేలా చూసే బాధ్యత తనదని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కోట నరసింహం, పీ పిచ్చయ్య, వేణు, రామారావు, గుర్రం సింగయ్య, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కోట వెంకటేశ్వర్లు తదితర ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ప్రత్యేక రథంపై ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

## తెలుగుభాషను పాలనాభాషగా అమలుచేయాలి

- లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నేత మాలకొండారెడ్డి

**జలదంకి, జూలై 21:** రాష్ట్ర ప్రభుత్వం అన్నిశాఖల పాలనాభాషగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయకమిటీ సభ్యుడు ముదిగండ్ల మాలకొండారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జలదంకిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాథమికవిద్యను మాతృభాషలో కనీసం 30శాతం అభ్యసించకుంటే అది మృతుభాషగా మారుతుందని యునెస్కో హెచ్చరించిందన్నారు. జిల్లాలో అధికార భాష శాఖలు ఏర్పాటు చేసి తీరుతెన్నులపై పరిశీలించాలని కోరారు. తెలుగు వ్యవహారిక పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులును స్ఫూర్తిగా తీసుకుని భాషా పరిరక్షణకు తెలుగు అధికారభాషా సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

## విద్యా ప్రదాత డీఆర్

- నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ



వృద్ధురాలికి నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న సురేంద్ర రెడ్డి

**కావలి, జూలై 21:** విశ్వోదయ వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) విద్యాప్రదాత, దార్శనికుడని సమాజానికి ఆయన అందించిన సేవలు అమూల్యమైనవని కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్ర రెడ్డి కొనియాడారు. డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సమితి కార్యాలయంలో 60మంది పేద వృద్ధులకు నిత్యావసర సరుకులు, బియ్యం, నగదు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేంద్రరెడ్డి మాట్లాడారు. డీఆర్ స్ఫూర్తితో వారి కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు తమ విద్యాసంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మీ, డైరెక్టర్ తాతిరెడ్డి,సభ్యులు నల్లూరు రామక్రిష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామసభలు

**అల్లూరు, జూలై 21 :** మండలంలోని 10గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం బీరంగుంట, ఇందుపూరు, పురిణిలలో, 23న తూర్పు గోగులపల్లి, పడమర గోగులపల్లి, గ్రద్దగుంట, 24న బట్రకాగొల్లు, ఇస్కపల్లి, నార్తుఆములూరు, వెలిచర్ల సభలు జరుగుతాయన్నారు. సభలకు అన్ని శాఖల మండలాధికారులు, సచివాయల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల, అభివృద్ధి పనులపై గ్రామస్తులతో చర్చించనున్నట్టు ఆమె తెలిపారు.

## న్యూరాలజీ ఉచిత వైద్యశిబిరం

**బిట్రగుంట, జూలై 21:** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెం విఘ్నేశ్వర రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో హ్యూమన్ రైట్స్, జైభీం అంబేద్కర్ సేవాదళ్ సంయుక్తంగా ఆదివారం ఉచిత న్యూరాలజి వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజీ వైద్యులు బిందుమీనన్, సిబ్బంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు గండూరి మంజుల, అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, జిల్లా హ్యూమెన్ రైట్స్ చీఫ్ దాసరి సునీల్, సభ్యులు షేక్ నూరుద్దీన్, ఎం.సురేష్, తిరుమల ఉన్నారు.